మక్కలు క్వింటా రూ.2,885



సంజీవ, రైతు

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 27: వరంగల్ (ఏనుమాముల) వ్యవసాయ మార్కెట్లో మంగళవారం మొక్కజొన్నలకు మంచి ధర పలికింది. ఇప్పటి వరకు మార్కెట్ చరిత్రలోనే పలుకని గరిష్ట ధర క్వింటాల్‌కు రూ.2,885 పలికింది. హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రానికి చెందిన బరిగెల సంజీవ 30బస్తాల మొక్కజొన్నలను మార్కెట్ అమ్మకానికి తీసుకువచ్చాడు. సంధ్య ట్రేడర్స్ అడ్తి ద్వారా ప్రేమ్ ఎంటర్ ప్రైజెస్ నిర్వాహకులు క్వింటా రూ.2885 చొప్పున ఖరీదు చేశారు.



సీఎంఆర్ఎఫ్ స్కామ్‌లో..
మాజీ గులాబీలు?

- పేదోళ్లకు చికిత్స ముసుగులో అక్రమాలకు తెగబడ్డ ఆస్పత్రులు
- వైద్యం చేయకుండానే నకిలీ బిల్లులతో నిధులు స్వాహా
- మాజీ ఎమ్మెల్యేల పీఏలతో పాటు వైద్యులు, ఉద్యోగుల పాత్రపై ఆరా
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో మూడు ఆస్పత్రులపై సీఐడీ విచారణ షురూ
- డీఎస్పీతో పాటు ఇద్దరు సీఐలు, 10మందికి పైగా సిబ్బందితో సీఐడీ టీమ్
- మరో ఐదారు ఆస్పత్రుల్లోనూ దందా జరిగిందంటూ ఫిర్యాదులు?

ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్).. పేదల వైద్యం కోసం సాయం అందించేలా రూపొందించిన పథకం. అలాంటి పథకంలో జరిగిన నిధుల స్వాహా కుంభకోణం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ సహాయనిధిపై కన్నేసిన కొన్ని బడా అస్పత్రులు.. నకిలీ పెషేంట్లు, బిల్లులతో రూ.కోట్లు కొల్లగొట్టాయి. లేని రోగులను.. రోగాలను సృష్టించి.. ఎలాంటి చికిత్స, ఆపరేషన్లు చేయకపోయినా.. చేసినట్టుగా బిల్లులు పెట్టిన పలు యాజమాన్యాలు సొమ్ములు నొక్కేశాయని గ్రహించిన ప్రభుత్వం పలు ఆస్పత్రులపై కేసులు నమోదు చేసి సీఐడీ విచారణకు ఆదేశించింది. ఆ ఆస్పత్రుల జాబితాలో ఉమ్మడివరంగల్ జిల్లాకు చెందిన మూడు ప్రైవేట్ ఆస్పత్రులు ఉండగా.. రంగంలోకి దిగిన సీఐడీ.. కుంభకోణంలో సూత్రధారులు, పాత్రధారుల గురించి కూపీలాగుతోంది. ఈ స్కామ్ వెనుక అస్పత్రుల యాజమాన్యాలు, వైద్యులు, అస్పత్రి ఉద్యోగులతో పాటు కొందరు మాజీ ఎమ్మెల్యేలు, వారి పీఏలు, గులాబీ నేతల పాత్ర ఉందనే ఫిర్యాదులు కూడా అందాయని సమాచారం. దీంతో అటు ప్రభుత్వం.. ఇటు సీఐడీ.. విచారణను వేగవంతం చేసినట్టు తెలుస్తోంది.

7

- వరంగల్, ఆంధ్రజ్యోతి ప్రతినిధి



రామప్ప దేవాలయంలోని రామలింగేశ్వరస్వామికి పూజలు చేస్తున్న గవర్నర్

రామప్ప దేవాలయంలోని శిల్పాలను తిలకిస్తున్న గవర్నర్

అభివృద్ధి, సంక్షేమ ఫలాలు
అందరికీ అందాలి

- ఆదివాసీలు అన్ని రంగాల్లో అభ్యున్నతి సాధించాలి
- కేంద్ర, రాష్ట్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
- కంటెయినర్ ఆస్పత్రుల ఏర్పాటు అభినందనీయం
- ములుగు జిల్లా పర్యటనలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- మంత్రి సీతక్క ఎమ్మెల్యేలతో కలిసి కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం
- విద్యావేత్తలు, జాతీయ క్రీడాకారులతో భోజనం
- ప్రఖ్యాత రామప్ప దేవాలయం సందర్శన
- లక్నవరం ఐలాండ్‌లోని పర్యాటక కాటేజీలో బస

ములుగు, ఆగస్టు 27: 'అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందరికీ అందాలి. ఆదివాసీలు, గిరిజనులు, అట్టడుగు వర్గాల అభ్యున్నతికోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కృషిచేస్తోంది. విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యమిస్తోంది. వీటిని అందిపుచ్చుకొని ప్రజలు,ముఖ్యంగా ఆదివాసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి. అలాగే విద్యతోనే ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందన్న విషయాన్ని అందూ గుర్తించాలి' అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. మూడురోజుల ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనకు గాను తొలిరోజైన మంగళవారం ఆయన ములుగు జిల్లాకు వచ్చారు. తొలుత గట్టమ్మ సమీపంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహం వద్ద రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర, ఎస్పీ శబరీశ్, ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా, డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్, అదనపు కలెక్టర్లు శ్రీజ, మహేందర్‌జీ పూలమొక్కలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. గంటసేపు విశ్రాంతి తర్వాత ములుగు కలెక్టరేట్‌కు చేసుకున్న గవర్నర్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అధికార యంత్రాంగంతో సమావేశమయ్యారు. మారుమూల అటవీ ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసీలకు అత్యవసర వైద్యసేవలు అందించేందుకు కంటెయినర్ ఆస్పత్రులు ఏర్పాటుచేయడం అభినందనీయమని, వినూత్న ఆలోచనను అమలుచేసిన మంత్రి సీతక్కను అభినందించారు. ఆధునిక సమాజంలో ఆదివాసీలు, గిరిజనులు భాగస్వాములను చేసేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. పేదలకు మౌళిక వసతులు కల్పించేందుకు ప్రత్యేకంగా కృషి చేయాలన్నారు. గతంలో తాను రూరల్ డెవలప్‌మెంట్, పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవం ఉందని తెలిపారు. గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా ఏజెన్సీ ప్రాంతానికి రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా జిల్లా భౌగోళిక పరిస్థితులు, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతీరుపై కలెక్టర్ టీఎస్.దివాకర పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. విస్తారమైన అడవులు, విశాలమైన గోదావరి తీరం, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌తో సరిహద్దును కలిగి ఉన్నట్లు తెలిపారు. వర్షాకాలంలో 80కిపైగా పరివాహక గ్రామాలు గోదావరి ముంపుకు గురవుతాయని, వానాకాలంలో ముంపు బాధితులను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామని వివరించారు. మాతాశిశు మరణాల రేటు గణనీయంగా తగ్గిందని, సంక్షేమ శాఖలను ఒకే గొడుగు కిందకు తీసుకు వచ్చి సమర్థవంతంగా అమలు చేస్తున్నా మని, సఖి కేంద్రం ద్వారా మహిళలకు భరోసా కల్పిస్తున్నావని తెలిపారు. ఎస్పీ శబరీశ్ శాంతిభద్రతల పరిరక్షణను వివరించారు.



లక్నవరం ఊయల వంతెనపై గవర్నర్

మేడారానికి జాతీయ హోదాకు చొరవ చూపాలి : సీతక్క

మేడారం మహాజాతరకు జాతీయ పండుగ హోదా

మిగతా 7వ పేజీలో..



అధికారులతో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చిత్రంలో మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెంకట్రావ్, అధికారులు

భారీ అగ్నిప్రమాదం

- పాతకర్రల దుకాణం, బార్‌దాన్ గోడౌన్‌లో ఘటన
- సోమవారం అర్ధరాత్రి దాటాక ఎగిసిన మంటలు
- రూ.20లక్షల వరకు ఆస్తినష్టం



దగ్ధమవుతున్న కర్రలు, బార్‌దాన్, మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ఖిలావరంగల్, ఆగస్టు 27: నగరంలో సోమవారం అర్ధరాత్రి దాటాక భారీ అగ్ని ప్రమాదం జరిగింది. వరంగల్‌లోని శివనగర్, ఇసుకఅడ్డా వద్ద గల పాత కర్రల షాపు, బార్‌దాన్ గోడౌన్‌లో ప్రమాదం జరగ్గా, సుమారు రూ.20లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. స్థానికుల కథనం ప్రకారం. నగరంలోని శివ నగర్ ఇసుక అడ్డా వద్ద సాజిత్‌పాష పాతకర్రల షాపు, ఊరటి వీర స్వామి జయ బార్‌దాన్ గోడౌన్ నిర్వహిస్తున్నాడు. రోజు మాది రిగానే సోమవారం రాత్రి షాపులను బంద్ చేసి ఇంటి వెళ్లారు. సోమవారం అర్ధరాత్రి దాటిక పాతకర్రల షాపు, బార్‌దాన్ గోడైన్‌లో పొగ, మంటలు ఎగిపడ్డాయి. మంగళవారం తెల్లవారుజాము నాలుగు గంటల సమయంలో మంటలు గమనించిన బాటసారులు షాపు యజమానులకు సమాచారమిచ్చారు. వారు వచ్చి 100కు డయల్ చేసి ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేయడంతో వారు విచ్చే సరిగా కర్రలు, బార్‌దాన్ గోడౌన్ మంటలు మరింత ఎక్కువయ్యాయి. నాలుగు ఇంజన్‌లతోపాటు ప్రొక్లైనర్‌తో రేకులను పక్కకు జరిపి మంటలను అదుపులోకి తెచ్చారు. మంటల దాటికి గోడౌన్ గోడలు కూలిపోయాయి. కర్రలషాపులో నూతనంగా కొనుగోలు చేసిన 4 మిషన్‌లు, పాతకర్రలు మొత్తం విలువ రూ.7లక్షలు, కాగా బార్‌దాన్ విలువ రూ.10లక్షలు, బార్‌దాన్ షెడ్ రూ.3లక్షలు మొత్తం రూ.20లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని బాధితులు పేర్కొన్నారు.

అలాగే పక్కనే ఫుడ్ ఫర్నిచర్, గ్లాస్ అద్దాల షాపునకు సైతం నష్టం వాటిల్లిట్టు బాధితులు వాపోయారు. ప్రమాద విషయం తెలియగానే మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు వచ్చి బాధితులను పరామర్శించారు. వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, ఖిలావరంగల్ ఆర్‌ఐ కీర్తిన్‌లు ఘటన వివరాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. పెద్ద సంఖ్యలో స్థానికులు రావడంతో మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య, ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించారు. కార్పొరేటర్‌లు బైరబోయిన ఉమా-దామోదర్‌యాదవ్, పోశాల పద్మ-స్వామి గౌడ్, గుండు చందన-పూర్ణచందర్, వెల్పుగొండ సువర్ణ-సురేష్, మాజీ కార్పొరేటర్ కేడల పద్మ-జనార్దన్, కత్తెరశాల వేణు గోపాల్, కాంగ్రెస్ నాయకులు మీసాల ప్రకాశ్, పగడాల సతీష్, బొరిగం నర్సింగం, శ్రీరాం రాజేష్, ఆయూబ్, సమీనా, లింగమూర్తి, అర్షం రాంబాబు, బాధితులను పరామర్శించారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, బాధితులను పరామర్శించారు.



అధికారులతో మాట్లాడుతున్న మురళీధర్‌రావు

శివనగర్ ఇసుకఅడ్డా వద్ద పాతకర్రల షాపుతోపాటు బార్‌దాన్ గోడౌన్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకో వడంతో శివనగర్, మొట్లబావి సమీపంలోని చుట్టూ పక్కల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. నివాసాల సమీపంలో పాతకర్రల షాపులు ఉండడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు.

రాజముద్ర రగడ

- కాకతీయ తోరణం, చార్మినార్ లేని లోగోతో ఫ్లెక్సీ ఏర్పాటు
- సీఎస్‌ను ట్యాగ్ చేస్తూ 'ఎక్స్'లో కేటీఆర్ విమర్శలు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 27: బల్దియా టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల స్వీకరణ కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో కాకతీయ కళాతోరణం,చార్మినార్ లోగోతో కూడిన తెలంగాణ రాష్ట్ర రాజముద్ర చిహ్నాన్ని మరిచి.. ఇంకా ఆమోదించని ప్రచారంలో ఉన్నదాన్ని ముద్రించడం వివాదాస్పద మైంది. వివరాల్లోకి వెళితే. ఎల్ఆర్ఎస్ సమస్యలను పరిష్కరిస్తూ భూములను క్రమబద్ధీకరించాలని ఇటీవల ప్రభుత్వం జీవో జారీ చేసింది. 2020 ఆగస్టు 26 లోపు ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి భూములను క్రమ బద్ధీకరిస్తూ ప్రచారం చేయాలని మునిసిపాలిటీలకు ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 24 నుంచి బల్దియా కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ, ప్రజలకు అవగాహన, భూముల సమస్యల పరిష్కారం చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేస్తున్నట్టు కలెక్టర్ కార్యాలయంతోపాటు బల్దియా కార్యాలయంలో రెండు చోట్ల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీలలో రాజముద్రను మరిచి ఇంకా అమలులోకి రాని ప్రచారంలో ఉన్న రాజముద్రను ముద్రించారు. తప్పిదాన్ని గమనించిన స్థానికులు, బీఆర్ఎస్ నాయకులు.. బల్దియా వద్ద నిరసన తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్ వేదికగా చీఫ్ సెక్రెటరీకి ట్యాగ్ చేస్తూ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. దీంతో అధికారులు చేసిన తప్పును తెలుసుకుని మంగళవారం పాత ఫ్లెక్సీని తొలగించి కొత్త ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు.



వివాదానికి కారణమైన పాత ఫ్లెక్సీ

షోకాజు నోటీసులు జారీ

ఫ్లెక్సీని ముద్రించి కట్టించిన టౌన్‌ప్లానింగ్ పర్యవేక్షణాధికారికి మంగళవారం కమిషనర్ అశ్విని తానాజీ వాకడే షోకాజు నోటీజులు జారీ చేశారు. చేసిన తప్పుపై సంజాయిషీ ఇవ్వాలని కోరారు. దీంతో సదరు అధికారి తాను తయారు చేయించిన ఫ్లెక్సీని కమిషనర్‌తోపాటు ఉన్నతాధికారులు కూడా చూశారని, వారు ఆమోదం తెలిపిన తర్వాతనే ఫ్లెక్సీ కట్టించానని తెలిపారు. తాను తప్పు చేసినట్టు ఒక్కడినే బాధ్యుడిగా చేసి మెమో ఇవ్వడం సరైంది కాదన్నారు. తనతోపాటు ఉన్నతాధికారులకు కూడా షోకాజు నోటీజులు ఎందుకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

ఆధునిక సాగుతోనే ఆహార ఉత్పత్తుల పెరుగుదల

నాబార్డు సీజీఎం సుశీల చింతల

ఐనవోలు, ఆగస్టు 27 : మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక సాగు విధానంతోనే అహార ఉత్పత్తులను పెంపొందించుకోవాలని నాబార్డు సీజీఎం సుశీల చింతల తెలిపారు. వరంగల్ నాబార్డు క్లస్టర్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఐదు రైతు ఉత్పత్తి దారుల సంఘాలకు వ్యవసాయ డ్రోన్‌ల పంపిణీ ప్రారంభోత్సవ కార్యక్రమం నాబార్డు డీడీఎం చంద్రశేఖర్ అధ్యక్షతన మంగళవారం రాంనగర్ రైతు వేదికలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొని సీజీఎం మాట్లాడుతూ.. సంప్రదాయ వ్యవసాయంలో టెక్నాలజీ మేళవింపు ఎంతో అవసరమని, అందుకు యూనివర్సిటీలు దోహదపడాలన్నారు. ఐటీ, నిర్మాణరంగాలు అభివృద్ధి చెందినంత మాత్రాన దేశం అభివృద్ధి చెందినట్లు కాదని, సాంకేతిక వ్యవసాయం అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందినట్లన్నారు. వ్యవసాయాన్ని ఆధునీకరించుకోకపోతే భవిష్యత్‌లో వ్యవసాయ ఉత్పత్తులు తగ్గి భయంకరమైన పరిస్థితులు ఎదురౌవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. తడి, పొడి వరిసాగు విధానాన్ని అవలంభించడం వలన భావితరాలకు నీటి కటకట తప్పుతుందన్నారు. నాబార్డు, కార్నెల్ సత్‌గురు ఫౌండేషన్ (సీఎస్ఎఫ్‌డీ) సహకారంతో వ్యవసాయ డ్రోన్‌ల ద్వారా గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడమే తమ లక్ష్యమన్నారు.



డ్రోన్‌ను ప్రారంభిస్తున్న సీజీఎం సుశీల

టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మట్లాడుతూ.. డ్రోన్‌ల పిచికారీతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. వ్యవసాయరంగాన్ని బలోపేతం చేయడానికి నాబార్డు, సొసైటీలు ఎల్లప్పుడు సహకారం అందిస్తాయన్నారు. వ్యవసాయశాస్త్రవేత్త ఉమ్మారెడ్డి మాట్లాడుతూ.. డ్రోన్‌ల పిచికారీ ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. రైతులు సమష్టిగా ఉండి వ్యవసాయం చేస్తే నష్టాలు కలుగవన్నారు. వ్యవసాయంలో యాంత్రీకరణ తప్పనిసరిగా ఏర్పడిందన్నారు. అనంతరం వేదిక పక్కనే ఉన్న పత్తిచేలో పురుగుల మందును డ్రోన్ ద్వారా పిచికారీ చేసి ఐనవోలు, జఫర్‌గడ్ ఎఫ్‌పీవోలకు డ్రోన్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాబార్డు డీజీఎం టీజీఆర్‌వో స్వాతి తివారి, ఏపీజీవీబీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, డీడీఎం రవితంగ, కార్నల్ సత్‌గురు ఫౌండేషన్ ప్రతినిధి రాజేశ్వరి, ఐనవోలు, నెక్కొండ, జఫర్‌గడ్, హసన్‌పర్తి, నేలమ్మ రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, సహాయ సోషల్ సర్వీస్ సేవా సొసైటీ కార్యదర్శి విజయ్‌కుమార్, స్పందన సర్వీస్ సొసైటీ కార్యదర్శి చొప్పరి సోమయ్య, పోతన ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి పి.వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్ క్రాప్స్ సంస్థ ప్రతినిధులతోపాటు ఆయా మండలాల రైతులు పాల్గొన్నారు.



మేరామాయాడి, సంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటాలకు పూలమాలలు వేస్తున్న ఎంపీ రాజేందర్, బంజార నేతలు

తీజ్ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా గుర్తించాలి

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

వడ్డెపల్లి, ఆగస్టు 27: తీజ్ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా గుర్తించాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం హనుమకొండ అశోక కాలనీలోని గిరిజన భవన్‌లో గోర్ బంజార తీజ్ ఉత్సవకమిటీ గ్రేటర్ వరంగల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తీజ్ ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మేరామాయాడి, సంత్ సేవాలాల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తీజ్ పండగను గుర్తించి సెలవుదినంగా ప్రకటించాలని కోరారు. ఈ సందర్భంగా బంజార మహిళలు నిర్వహించిన ఆట పాటలు అంబరాన్ని అంటాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, మల్లాడి తిరుపతిరెడ్డి, ఎడ్ల అశోక్‌రెడ్డి, డాక్టర్ కాళీ ప్రసాద్, గోర్ బంజార తీజ్‌ఉత్సవ కమిటీ ప్రతినిధులు బిఎన్.నాయక్, బానోతు వెంకన్న నాయక్, వినోద్ లోక్ నాయక్, కిశోర్ నాయక్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులతో జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న సీతమ్మ

శతాధిక వృద్ధురాలి జన్మదిన వేడుకలు

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు27: వందేళ్ల వృద్ధురాలు రావి సీతమ్మ జన్మదిన వేడుకలు తన మనవడు కొల్లి అనిల్‌కుమార్ - సౌజన్య దంపతుల ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండలోని వారి నివాసంలో ఘనంగా నిర్వహించారు. రావి సీతమ్మకు ఐదుగురు సంతానం కాగా, వారిలో ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వంద ఏళ్లు అయినా ఇప్పటికీ సీతమ్మ ఆరోగ్యంగా ఉండటంతో కుటుంబ సభ్యులు సీతమ్మ జన్మదినాన్ని పండుగలా నిర్వహించారు. సీతమ్మది ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం కాగా, జన్మదిన వేడుకలను సీతమ్మ పెద్ద కుమార్తె స్వరూపరాణి కుమారుడు అనిల్ నివాసంలో సీతమ్మ కుమారులు, కుమార్తెలు, మనువలు, మనుమరాండ్లు, మునిమనమలు, మునిమనమరాండ్లు, బంధుమిత్రుల సమక్షంలో ఆడంబరంగా నిర్వహించారు. కాగా, సీతమ్మ స్వాంతంత్ర్య సమరయోధురాలిగా కీర్తిగడించింది.

హైడ్రాలాగే మనకూ కావాలి ‘వాడ్రా’

ఫోరం ఫర్ బెటర్ వరంగల్ అధ్యక్షుడు పుల్లూరు సుధాకర్



మాట్లాడుతున్న సుధాకర్

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 27: హైదరాబాద్‌లోని హైడ్రా వ్యవస్థలాగే వరంగల్ నగరానికి వాడ్రా వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఫోరం ఫర్ బెటర్ వరంగల్ అధ్యక్షుడు పుల్లూరు సుధాకర్ ప్రభుత్వాన్ని కోరారు. హనుమకొండ కలెక్టరేట్‌లోని టీజీవో భవన్‌లో మంగళవారం ఫోరంఫర్ బెటర్ వరంగల్ ఆధ్వర్యంలో మేధావుల సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పుల్లూరు సుధాకర్ మాట్లాడుతూ.. నగరాల అస్తవ్యస్థ విస్తరణ, చెరువులు, నాలాలలో వెలిసిన అక్రమ నిర్మాణాలు నగర పర్యావరణ వ్యవస్థను ధ్వంసం చేసి వరదల వంటి పెను విపత్తులకు కారణమవుతోందన్నారు. వరంగల్ నగరంలో చెరువులు, నాలాలు ఆక్రమణలకు గురయ్యాయని, ఈ ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలంటే హైడ్రా లాంటి స్వతంత్ర్య వ్యవస్థ వరంగల్‌కు ఎంతో అవసరం అన్నారు. వరంగల్ నగర ప్రత్యేక పరిస్థితులకు అనుగుణంగా వాడ్రాలో నిబంధనలు పొందుపరచాలన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల వేదిక అధ్యక్షులు ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ.. రాజకీయ నాయకులు, అధికారుల ఒత్తిళ్లకు తలొగ్గని విధంగా వాడ్రా నిర్మాణం ఉండాలన్నారు. చట్ట వ్యతిరేకంగా అనుమతులు ఇచ్చిన అధికారులను, వాటి వెనుక ఉన్న రాజకీయ నాయకులపై కఠిన చర్యలు ఉండాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు కాజీపేట పురుషోత్తం, జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు లక్ష్మారెడ్డిలు చెరువుల పరిరక్షణ పర్యావరణ అంశాలను వివరించారు. ఈ సమావేశంలో హైడ్రా ఏర్పాటు చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి అభినందనలు తెలుపుతూ తమ మద్దతును ప్రకటించారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. ఈ తీర్మానాలను సీఎం రేవంత్ రెడ్డికి పంపాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో తిరుణహరి శేషు, ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ ప్రతినిధులు పెరుమాళ్ల లక్ష్మణ్, శ్రవణ్‌కుమార్, వేణు, ప్రొఫెసర్ విజయబాబు, అనుమాండ్ల విద్యాసాగర్, జి.యాదగిరి, రాజ్‌మోహన్‌రావు, మండల పరశురాములుతోపాటు వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ స్కామ్‌లో.. మాజీ గులాబీలు?



- పేదోళ్లకు చికిత్స ముసుగులో అక్రమాలకు తెగబడ్డ ఆస్పత్రులు
- వైద్యం చేయకుండానే నకిలీ బిల్లులతో నిధుల స్వాహా
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో మూడు ఆస్పత్రులపై సీఐడీ విచారణ షురూ

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన సీఎంఆర్ఎఫ్ స్కాం ఓరుగల్లులోనూ ప్రకంపనలు రేపుతోంది. పేదోళ్ల వైద్య సేవలకు కేటాయించే సీఎం సహాయనిధి పై కన్నేసిన కొన్ని బడా అస్పత్రులు.. నకిలీ పేషేంట్లు, బిల్లులతో రూ.కోట్లు కొల్లగొట్టాయి. లేని రోగులను.. రోగాలను సృష్టించి.. ఎలాంటి చికిత్స, ఆపరేషన్లు చేయకపోయినా.. చేసినట్టుగా బిల్లులు పెట్టిన పలు యాజమాన్యాలు సొమ్ములు నొక్కేశాయి. ‘తీగ లాగితే డొంక కదిలింది’ అన్న చందంగా అక్రమాలన్నీ ఒక్కొక్కటిగా బహిర్గతమవుతున్నాయి. ఈ సీఎఆర్ఎఫ్ స్కామ్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో మూడు అస్పత్రులపై కేసు నమోదు చేసి సీఐడీ విచారణకు ఆదేశించింది. దీంతో రంగంలోకి దిగిన సీఐడీ కుంభకోణంలో సూత్రధారులు, పాత్రధారుల గురించి కూపీలాగుతోంది. అయితే ఈస్కామ్ వెనుక అస్పత్రుల యాజమాన్యాలు, వైద్యులు, అస్పత్రి ఉద్యోగులతో పాటు కొందరు మాజీ ఎమ్మెల్యేలు, వారి పీఏలు, గులాబీ నేతల పాత్ర ఉందనే ఫిర్యాదులు రావటంతో ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించిందన్న చర్చ రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

నకిలీ బిల్లులతో రూ.కోట్లు స్వాహా..

ప్రభుత్వం పేద ప్రజలకు వైద్య సేవల కోసం చీఫ్ మినిస్టర్ రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) నుంచి ఆర్థిక సాయం అందజేస్తుంది. ఏదైనా రోగం వస్తే అస్పత్రిలో చికిత్స పొందిన వారికి సదరు అస్పత్రి ఇచ్చే బిల్లులను పరిశీలించి 50శాతం నుంచి 100శాతం వరకు ప్రభుత్వం బాధితులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా చెక్కుల రూపంలో తిరిగి చెల్లిస్తుంది. కొన్ని వ్యాధులకు చికిత్స పొందుతుండగానే ఎమ్మెల్యేల నుంచి ఎల్‌వోసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) అందిస్తారు. ఈ ఎల్‌వోసీ ఆధారంగా చికిత్స పూర్తయిన తరువాత సీఎంఆర్ఎఫ్ నుంచి డబ్బులు దవాఖానా ఖాతాలో జమ చేసుకుంటారు. దీన్ని అవకాశంగా తీసుకున్న కొన్ని ప్రైవేట్ అస్పత్రులు సీఎంఆర్ఎఫ్‌పై కన్నేశాయి. లేని రోగాలను, రోగులను సృష్టించాయి. నకిలీ రోగులను సృష్టించి, వారికి ఖర్చుతో కూడుకున్న వైద్యం చేసినట్టుగా నకిలీ బిల్లులు తయారు చేసి సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేయించారు. ఈ క్రమంలో గ్రామాల్లోని కొంతమంది ఆర్ఎంపీలు, పీఎంపీల సాయంతో రోగుల పేర్లతో నకిలీ బిల్లులు తయారు చేసినట్టుగా సమాచారం. సీఎంఆర్ఎఫ్ డబ్బులు రోగుల ఖాతాలో జమ చేసిన తరువాత 15శాతం నుంచి 20శాతం వరకు నకిలీ రోగులకు, సహకరించిన ఆర్ఎంపీ లేదా పీఎంపీలకు ఇచ్చి, మిగతా సొమ్మును హాస్పిటల్‌కు చేరుతాయని సమాచారం. అయితే ప్రముఖ అస్పత్రుల బిల్లులే కావటంతో సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆయా అస్పత్రులకు నిధులు మంజూరు చేసింది. ఇలా నకిలీ బిల్లులతో రూ.కోట్లాది నిధులు అస్పత్రులకు కాసుల పంట పండించింది. రాష్ట్రవ్యాప్తంగా 28 అస్పత్రులు కాసులకు కక్కుర్తి పడి సీఎంఆర్ఎఫ్ సొమ్ము కాజేసినట్టుగా సీఐడీ అధికారులు గుర్తించారు. సీఎంఆర్ఎఫ్ సెక్షన్ అధికారి డాక్టర్ డీఎస్.మూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరు ఎఫ్ఐఆర్‌లు, 17 కేసులను నమోదు చేసింది. వీటిలో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో హనుమకొండలోని రోహిణి అస్పత్రి, మహబూబాబాద్ జిల్లాలోని శ్రీసంజీవిని అస్పత్రి, సిద్ధార్థ హస్పిటల్‌పై కేసులు నమోదు చేసి సీఐడి విచారణకు ప్రభుత్వం ఆదేశించింది.

స్కాంపై సీఐడీ విచారణ షురూ...

ప్రభుత్వ ఆదేశాలతో సీఐడీ అధికారులు విచారణ చేపట్టారు. సీఎంఆర్ఎఫ్‌లోని వ్యక్తులు, ప్రైవేటు దవాఖానాల యాజమాన్యాలు, కొందరు ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది, అకౌంటెంట్ అధికారులు, గత ప్రభుత్వం కీలకంగా వ్యవహరించిన కొంతమంది రాజకీయనేతలు, నాటి ఎమ్మెల్యేలు, వారి పీఏలు అంతా చైన్‌లింక్‌గా ఏర్పడి ఈ కుంభకోణానికి తెరలేపినట్టు సీఐడీ అధికారులు గుర్తించారు. దీంతో వరంగల్, ఖమ్మం జిల్లాలో జరిగిన ఈ భారీ కుంభకోణాన్ని విచారించేందుకు ఒక డీఎస్పీ స్థాయి అధికారితో పాటు ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్సైలతో కలిపి సుమారు పది మంది వరకు టీమ్‌తో విచారణ చేపట్టారు. మహబూబాబాద్‌లోని రెండు ప్రైవేట్ అస్పత్రులు, హనుమకొండలోని ఒక అస్పత్రిలో సీఐడీ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు పొందిన రోగుల వివరాలు, వారికి వైద్యం చేసిన వైద్యుల పేర్లు, ఏ రోగానికి ఏ చికిత్స చేశారో.. అందుకు సంబంధించిన డాక్యుమెంట్లు, రోగుల వివరాలను, ఆన్‌లైన్‌లో నమోదు చేసిన రికార్డులను సీఐడీ అధికారులు పరిశీలించినట్లుగా సమాచారం. అయితే ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలో మూడు అస్పత్రులపైనే కేసులు నమోదైనా.. మరో ఐదారుఅస్పత్రులపై కూడా ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లినట్టు తెలిసింది. వాటిపై కూడా సీఎంఆర్ఎఫ్ విభాగం అధికారులు సమాచారాన్ని సేకరిస్తున్నారని, సరైన ఆధారాలు లభిస్తే వాటిపై కూడా సీఐడీ విచారణకు ప్రభుత్వం ఆదేశించే అవకాశాలున్నట్టు తెలుస్తోంది.

స్కాంలో గులాబీ నేతల పాత్రపై ఆరా..?

గత ప్రభుత్వ హయంలోనే ఈ భారీ స్కాం జరిగినట్టుగా అధికారులు గుర్తించారు. గత 2023 ఏప్రిల్ నెల వరకు జరిగిన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీపైనే ఫిర్యాదులు వస్తున్నాయి. దీంతో అప్పటి గులాబీ పార్టీ ఎమ్మెల్యేల ఒత్తిడి, పాత్ర ఏమైనా ఉందా అనే కోణంలో కూడా సీఐడీ విచారణను చేపట్టినట్టు సమాచారం. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మహబూబాబాద్ జిల్లాలో సీఎంఆర్ఎఫ్ స్కాంలో అప్పటి అధికార పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యే పాత్ర ఉందనే ప్రచారం జరుగుతోంది. వైద్యులపై ఒత్తిడి తెచ్చి భారీగా సీఎంఆర్ఎఫ్ చెక్కులు నకిలీ రోగులకు పంపిణీ చేసి అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు తాజా మాజీ ఎమ్మెల్యేతో పాటు ఆయన అనుచరులు కూడా ఈ స్కాంలో భారీగా వెనుకేసుకున్నారని, అలాగే హనుమకొండ, వరంగల్ జిల్లాల పరిధిలోని కొందరు మాజీ ఎమ్మెల్యేల పాత్ర ఉందనే చర్చ జరుగుతోంది. కొంతమంది మాజీ ఎమ్మెల్యేల పీఏలు కూడా సీఎంఆర్ఎఫ్ స్కామ్‌లో చక్రం తిప్పినట్టు సమాచారం. కొన్ని ప్రైవేట్ అస్పత్రుల యాజమాన్యాలతో సత్సంబంధాలు ఉండటంతో అప్పటి గులాబీ లీడర్లు సీఎంఆర్ఎఫ్‌ను తమకు అనుకూలంగా వాడుకున్నారనే ప్రచారం జరుగుతోంది. సీఎంఆర్ఎఫ్ సెక్షన్ అధికారి డాక్టర్ డీఎస్.మూర్తి ఇచ్చిన ఫిర్యాదులో కూడా రాజకీయ నేతలు, వారి అనుచరుల పాత్రపై అనుమానాలు వ్యక్తం చేయటంతోనే ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశించింది. 2023 ఏప్రిల్ వరకు ఇచ్చిన సీఎంఆర్ఎఫ్‌పైనే ఫిర్యాదులపైనే ప్రస్తుతం విచారణ జరుగుతోందని, గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై తీగ లాగితే.. ‘గులాబీ’ డొంక కదులుతుందని ప్రస్తుత ప్రభుత్వం భావిస్తోందని సమాచారం. కాగా, సీఐడీ రంగంలోకి దిగటంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో గులాబీ నేతల ప్రమేయం ఉందా లేదా అనేది తేలటంతో పాటు ప్రైవేటు అస్పత్రుల్లో జరిగిన సీఎంఆర్ఎఫ్ స్కాం ఎంత అనే అంశాలు కూడా త్వరలోనే వెలుగులోకి వచ్చే అవకాశాలున్నాయనే చర్చ జరుగుతోంది.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో సీఐడీ ఎఫ్ఐఆర్ నమోదు చేసిన అస్పత్రులు

రోహిణి మెడికేర్ ప్రవేటు లిమిటెడ్ (హనుమకొండ), సిద్ధార్థ హస్పిటల్ (మహబూబాబాద్), శ్రీసంజీవిని హస్పిటల్ (మహబూబాబాద్).

ఎంఏ తెలుగు ప్రవేశ గడువు పొడిగింపు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 27: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు ప్రవేశాల గడువును పొడిగించినట్లు వరంగల్ జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ భూక్య బాబూరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 24తోనే ప్రవేశాల గడువు ముగియగా విద్యార్థుల అభ్యర్థన మేరకు ఈ నెల 31 వరకు రూ.100 ఆలస్య రుసుముతో ప్రవేశాలు పొందే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు తెలుగు యూనివర్సిటీ వెబ్‌పోర్టల్‌ను సందర్శించాలని ఆయన కోరారు.

1న ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 27: తెలంగాణ చెస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా చెస్ క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి చెస్ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వహణ కార్యదర్శి కన్న ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-11 బాల బాలికల విభాగంలో నిర్వహించనున్న ఎంపికలో 1జనవరి 2013 తరువాత జన్మించిన వారు పాల్గొనవచ్చునన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి 4 బాలురు, 4 బాలికలను సెప్టెంబరు చివరి వారం హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు వెంట తీసుకొని సెప్టెంబరు 1న టీటీడీ కల్యాణ మండపంలో ఉదయ 9 గంటలకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9059522986 నెంబర్‌లో సంప్రదిచాలని ఆయన కోరారు.

నేడు వరంగల్ -1 డిపోలో డయల్ యువర్ డీఎం

బాలసముద్రం, ఆగస్టు 27: వరంగల్ -1 డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, నిజామాబాద్, సిద్ధిపేట, పాలకుర్తి, తరిగొప్పుల రూట్లల్లో ప్రయాణించే ప్రయాణికులు డయల్ యువర్ కార్యక్రమంలో తమ సలహాలు, సూచనలు ఫోన్ నెంబర్‌లో 99592 26047 తెలపాలని కోరారు.

మెడికల్ కళాశాలలో కాంట్రాక్ట్ పోస్టుల భర్తీ

జనగామ రూరల్, ఆగస్టు 27: జనగామ మెడికల్ కళాశాలలో, జిల్లా ప్రభుత్వ జనరల్ అనుపత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిలో పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తునట్లు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావు మంగళవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. వివిధ డిపార్ట్‌మెంట్‌లో ప్రొఫెసర్-1, అసోసియేట్ ప్రొఫెసర్-4, అసిస్టెంట్ ప్రొఫెసర్-6, సీనియర్ రెసిడెంట్-25లకు దరఖాస్తులను ఆహ్వానిస్తునట్లు ఆయన తెలిపారు. ఈ నెల 29, 30న ఎంసీహెచ్‌లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూ ఉంటుందన్నారు.

ట్యాంక్‌బండ్‌పై ఒద్దిరాజు సోదరుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి

ప్రముఖ పాత్రికేయుడు దేవులపల్లి అమర్



సీనియర్ జర్నలిస్టు రాజమల్లుయాదవ్‌ను సన్మానిస్తున్న అమర్, ఒద్దిరాజు చారిటబుల్ ట్రస్టు బాధ్యులు

ఇనుగుర్తి, ఆగస్టు 27: హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై తెలంగాణలో మొట్టమొదటి తొలి తెనుగు పత్రిక స్థాపించిన ఒద్దిరాజు సీతారామచందర్‌రావు, రాఘవ రంగారావు సోద రుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని ప్రముఖ పాత్రికేయుడు దేవులపల్లి అమర్ తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. ఒద్దిరాజు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు సుభాష్ ఆధ్వ ర్యంలో మంగళవారం ఇనుగుర్తిలో ఏర్పాటు చేసిన శతాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన దేవులపల్లి అమర్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రాంతంలోని మారుమూల ప్రాంతమైన ఇనుగుర్తిలో తొలి తెలుగు భాషలో ప్రచురితమైన తెనుగు పత్రికను స్థాపించిన ఒద్దిరాజు సోదరులు నైజాం ప్రభుత్వానికి వ్యతి రేకంగా పోరాడారని చెప్పారు. ఈ తెనుగు పత్రిక ఖ్యాతి ఇనుగుర్తికి మాత్రమే పరిమితం కావడం చాలా బాధాకర మన్నారు. నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన మహనీయుల విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయా లని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా సమయం ఏమి మించిపో లేదని, ఈ గ్రామం నుంచి రాజ్యసభకు ఎంపికైన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సైతం ఈ విషయాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించి ఒద్దిరాజు సోదరుల విగ్రహాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో సైతం తెనుగు పత్రిక ఖ్యాతిని ఇమడింప చేశారని కొనియాడారు.

అనంతరం మహబూబాబాద్ జిల్లాలోని సీనియర్ జర్నలిస్టులు వేల్పుల రాజమల్లుయాదవ్, బండి సంపత్‌కుమార్, పర్కాల రవీందర్‌రెడ్డిలను శాలువాలతో ఘనంగా సత్కరించి మెమోంటోలు అందించారు. ఈ కార్యక్రమంలో గాయత్రి గ్రానైట్స్ అధినేత వద్దిరాజు కిషన్, మాజీ సర్పంచ్ దార్ల రామ్మూర్తి, మాజీ ఎంపీటీసీ మంగ్యానాయక్, వద్దిరాజు పెద్దవెంకన్న, సాహితీవేత్తలు లక్ష్మీకాంతారావు, వద్దిరాజు రాంబాబు, సీతారామచందర్‌రావు, వేణుగోపాల్ రావు, వినయ్‌బాబు, అనిల్‌కుమార్, సతీష్, చంద్రప్రకాష్, కల్యాణ్‌చంద్ర, జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఎంజీఎం నిర్వహణ అధ్వానం

‘ఎక్స్’ వేదికగా మాజీ మంత్రి హరీష్‌రావు విమర్శలు

వరంగల్ మెడికల్, ఆగస్టు 27: వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి కాంగ్రెస్ పాలనలో పూర్తిగా అధ్వానంగా మారిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తన్నీరు హరీష్‌రావు ఆరోపించారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ ఖాతాలో చేసిన ఓ పోస్టు చర్చనీయాంశమైంది. ఎంజీఎంలో పేద రోగులకు అందించేందుకు మందులు కూడా కరువయ్యాయని, దాంతో రోగులు డబ్బులు చెల్లించి మరీ మందులు కొనుక్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వేలాది మంది పేద ప్రజలకు ఆరోగ్యాన్ని అందించే ఎంజీఎం సమస్యల వలయంలో ఉందని విమర్శించారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీరకం)	2,711	2,572
మక్కలు (బిల్టీరకం)	2,885	2,572
పల్లికాయ (పచ్చిది)	4,300	3,400
పల్లికాయ (సూక)	6,310	5,200
కందులు	8,652	8,652
పెసళ్లు	6,150	2,659
పత్తి	7,600	5,000
పసుపు (కాడి)	12,233	11,666
పసుపు (గోల)	12,059	11,635
తేజ మిర్చి	12,500	8,500
తేజ ఏసీ	18,000	15,000
వండర్‌హాట్ ఏసీ	16,000	13,000
యూఎస్341 ఏసీ	14,000	11,000
తాలు మిర్చి	6,000	3,000

ఈఆర్‌సీ నియామకాల్లో పారదర్శకత లోపించింది

టీజీఈఆర్‌సీ అభ్యర్థుల ఆరోపణ

హనుమకొండ టౌన్, ఆగస్టు 27: తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్‌లో నియమించబడ్డ ఉద్యోగుల ఎంపికలో పారదర్శకత లోపించిందని టీజీఈఆర్‌సీ అభ్యర్థులు ఆరోపించారు. గత మార్చిలో టీజీ ఈఆర్‌సీలో 11 పోస్టులకుగానూ నోటిఫికేషన్ ఇవ్వగా, టీజీ ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కమ్‌ల్లోని పలువురు ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. జూలై 17, 18, 19 తేదీల్లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. కాగా 11 పోస్టుల్లో పవర్ సెక్టార్‌లోని జాయింట్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ పోస్టులకు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో అవకతవకలు జరిగాయని, వెంటనే ఆ నియామకాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ విభాగంలో ఫీల్డ్‌లో పనిచేస్తున్న అభ్యర్థులకు మాత్రమే డిప్యూటీ డైరెక్టర్స్, జాయింట్ డైరెక్టర్ పోస్టుల్లో ప్రాధాన్యత ఉంటుందని చెప్పి 24 యేళ్లుగా వివిధ హోదాల్లో పనిచేసి ప్రస్తుతం డీఈగా పనిచేస్తున్న వారిని కాదని కార్యాలయంలో పనిచేసే టీజీఎస్పీడీసీఎల్ డిస్కమ్‌కు చెందిన వ్యక్తికి ఉద్యోగం కట్టబెట్టారన్నారు. ఇంటర్వ్యూలకు వీడియోగ్రఫీ లేకుండా, షార్ట్‌లిస్టును, ఫలితాలను వెబ్‌సైట్‌లో పెట్టకుండా గోప్యంగా కొంతమందికి ఫోన్‌లు చేసి ఉద్యోగానికి ఎంపికయ్యారని తెలియజేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ నియామకాలపై పలు అనుమానాలున్నాయని, వీడియో రికార్డు సమక్షంలో తిరిగి ఇంటర్వ్యూలు నిర్వహించాలని టీజీఈఆర్‌సీ బాధిత అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. కాగా, ఏ ప్రతిపాదికన ఆయా పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేశారో తెలియజేయాలని టీజీఈఆర్‌సీకి ఆర్‌టీఐ ద్వారా దరఖాస్తు చేశామన్నారు.

రామప్పకు మళ్లీ వస్తా..

దేశంలో ఇలాంటి శిల్పకళ ఎక్కడాలేదు.. : గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ







కోటగుళ్లలో ప్రత్యేక పూజలు చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ వర్మ

ములుగు కలెక్టరేట్‌లో అధికారులతో..

కోటగుళ్ల శిల్పాలను పరిశీలిస్తున్న గవర్నర్

వెంకటాపూర్(రామప్ప), ఆగస్టు 27: ‘దేశం మొత్తం పర్యటించినా రామప్ప లాంటి సుందరమైన దేవాలయం మరెక్కడా లేదు. అలాంటి సుందరమైన రామప్పకు మళ్లీ వస్తా. కుటుంబ సమేతంగా వచ్చి సందర్శిస్తా’ అని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పేర్కొన్నారు. మూడురోజుల ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామప్ప రామలింగేశ్వరస్వామి దేవాలయాన్ని సందర్శించారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.వెంకటేశం, కలెక్టర్ టీఎస్.దివాకర, ఎస్పీ శబరీశ్‌తో కలిసి పర్యటించారు. తొలుత పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ఆయనకు దేవాలయ వేదపండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రుద్రేశ్వరుడికి గవర్నర్ ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు ఆయన్ను పట్టువస్త్రాలతో సత్కరించి ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ రామప్ప దేవాలయం అబ్బురపరిచిందని, ఇక్కడి శిల్పకళా సంపద ఎంతో అద్భుతమన్నారు. దేశంలో ఇలాంటి సుందరమైన దేవాలయాన్ని ఇక్కడే చూస్తున్నానని, యునెస్కో గుర్తింపు లభించడం హర్షణీయమన్నారు. ఈ గుర్తింపు ఎప్పుడో దక్కాల్సిందన్నారు. రామప్ప సరస్సు ఒక సరోవరంలా ఉందని కితాబిచ్చారు. ఆయన వెంట ములుగు అదనపు కలెక్టర్ పి.శ్రీజ, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఓఎస్డీ గీతే మహేష్ బాబాసాహెబ్, పర్యాటక శాఖ ఎండీ ప్రకాష్‌రెడ్డి, ప్రొఫెసర్ పాండురంగారావు, టూరిజం డెవలప్‌మెంట్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, పురావస్తు శాఖ జిల్లా అధికారి మల్లేశం, టూరిజం అధికారి సూర్యకిరణ్, దేవాదాయ శాఖ ఏసీ సునీత, తహసీల్దార్ సదానందం, పురావస్తుశాఖ, దేవాదాయ శాఖ అధికారులు ఉన్నారు.

కోటగుళ్లను సందర్శించిన గవర్నర్

గణపురం : భూపాలపల్లి జిల్లా గణపురంలోని కాకతీయుల కట్టడాలు, కోటగుళ్లను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సందర్శించారు. మంత్రి సీతక్క, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. వేద పండితులు కుంభమేళా, మేళతాళాలతో ఆయనకు ఆలయంలోకి స్వాగతం పలికారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో పాటు మంత్రి సీతక్క, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు గవర్నర్‌ను సన్మానించి, ఆశీర్వచనాలు అందజేశారు. కోటగుళ్ల ఆవరణలో గతంలో తవ్వకాల్లో బయల్పడిన శిల్పాలను ఆయన సందర్శించారు. సుమారు 30 నిమిషాల పాటు గవర్నర్ పర్యటన కొనసాగింది. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం గవర్నర్ మాట్లాడుతూ కాకతీయుల వైభవాన్ని చాటి చెప్పే గొప్ప కట్టడం కోటగుళ్లని కొనియాడారు. 12వ శతాబ్దంలో కాకతీయులు ఓరుగళ్లను పరిపాలించినప్పుడు ప్రజల సౌకర్యార్థం అద్భుత కట్టడాలు నిర్మించడం గొప్ప విషయమన్నారు. కాకతీయుల కళా సంపదను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపే ఉందన్నారు.



రామప్ప ఆలయం ఆవరణలో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందరికీ అందాలి

(5వ పేజీ తరువాయి)

దక్కేలా చొరవ చూపాలని మంత్రి సీతక్క గవర్నర్‌ను కోరారు. త్రిపుర డిప్యూటీ సీఎంగా, మంత్రిగా పనిచేసిన క్రమంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధికోసం పాటుపడ్డారని, తెలంగాణ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటగా ములుగు జిల్లా పర్యటనకు రావడం పట్ల కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ములుగుప్రాంతంలో రాష్ట్రంలోనే అత్యధికంగా ఆదివాసీ, గిరిజన ప్రజలు నివసిస్తూ భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తున్నారన్నారు. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన సమ్మేళనమైన మేడారంసమ్మక్క, సారలమ్మ జాతర రెండేళ్లకోసారి జరుగుతుందని తెలిపారు. ఈప్రాంత సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారమందిస్తోందన్నారు.

క్రీడాకారులు, విద్యావేత్తలతో గవర్నర్ భేటీ

జాతీయ, రాష్ట్రస్థాయి పురస్కారాలు పొందిన విద్య, సామాజికవేత్తలు, కవులు, క్రీడాకారులతో ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో గవర్నర్ జిష్ణుదేవ్ భేటీ అయ్యారు. వారితో కలిసి భోజనం చేశారు. అంతకుముందు మంత్రి సీతక్క జిష్ణుదేవ్ వర్మతో ప్రత్యేకంగా సమావేశమై జిల్లా ప్రాధాన్యతను వివరించారు. గవర్నర్ భేటీలో ప్రొఫెసర్ పాండురంగారావు, రచయిత రాచర్ల గణపతి, అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు పాలడుగు వెంకటేశ్వర్‌రావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ అంబటి శ్రీజన్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కందాల రామయ్య, రెజ్లింగ్ క్రీడాకారిని చల్ల మౌనిక, జిమ్నాస్ట్ పి.రజిత, పర్యావరణ పరిశోధకుడు కాజాంపు రం దామోదర్, సోషల్ వర్కర్ కొమురం ప్రభాకర్ పాల్గొన్నారు. గవర్నర్ పర్యటనలో ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఓఎస్డీ మహేష్ గీతే, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

నేటి పర్యటన ఇలా..

మంగళవారం రాత్రి లక్నవరం పర్యాటక కాటేజీలో బస చేసిన గవర్నర్ జిష్ణుదేవ్ బుధవారం ఉదయం 6గంటల నుంచి 9గంటల వరకు లక్నవరం అందాలను వీక్షిస్తారు. ఆతర్వాత వరంగల్ చేరుకుని సాయంత్రం 6గంటలకు వరంగల్ కోటను సందర్శించి కాకతీయుల కాలంనాటి అపురూప శిల్పసంపదతో పాటు ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన కోట అభివృద్ధి పనులను ఆయన పరిశీలిస్తారు. ఇక మూడోరోజైన గురువారం జనగామ జిల్లాలో పర్యటించనున్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 27: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా డీఈవో ఎం.జ్ఞానేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. సెప్టెంబరు 11వరకు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా పేర్కొన్నారు. జనరల్, బీసీ విద్యార్థులు రూ.100, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ విద్యార్థులు రూ.50ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించి దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆయన తెలిపారు. పూర్తి వివరాల కోసం 99486 25186 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాల్సిందిగా సూచించారు.

'యెలుగం' సేవలు మరవలేనివి

ఆటోనగర్,ఆగస్టు 27: మాజీ కార్పొరేటర్ యెలుగం శ్రీనివాస్ సేవలు మరవలేనివని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి అన్నారు. గుండెపోటుతో శ్రీనివాస్ ఆదివారం మృతిచెందగా, మంగళవారం కొత్తవాడలోని ఆయన నివాసానికి వెళ్లి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు యెలుగం లీలావతి -సత్యనారాయణ, దామెర సర్వేశ్, గుడిబోయిన మణి-గోపాల్‌రావు, నాయకులు చిప్ప వెంకటేశ్వర్లు, గొండ శ్రీనివాస్, శంకర్, రాజ్‌కమల్, సంపత్‌పాల్గొన్నారు.

కవితకు బెయిల్.. బీఆర్ఎస్ సంబరాలు


స్వీట్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్

మట్టెవాడ, ఆగస్టు 27: బీజేపీ తెలంగాణలో కేసీఆర్‌ను ఎదుర్కోలేక ఎమ్మెల్సీ కవితపై అక్రమ కేసులు పెట్టిందని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆరోపించారు. మంగళవారం ఎమ్మెల్సీ కవితకు బెయిల్ రావడంతో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో శివనగర్, అండర్‌బ్రిడ్జి రోడ్డులో బాంబులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. నరేందర్ మాట్లాడుతూ ఏ ఆధారాలు చూపకుండా లిక్కర్ కేసులో 168 రోజులు కవిత మీద అక్రమ కేసులు పెట్టి జైలులో ఉంచడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, మరుపల్ల రవి, మాజీ మార్కెట్ ఛైర్మన్ టి. రమేశ్‌బాబు, మాజీ కార్పొరేటర్ కుందారపు రాజేందర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితపై ఈడీ కేసు అక్రమం : ఎంపీ

ఢిల్లీ లిక్కర్ పాలసీతో ఏ మాత్రం సంబంధం లేకున్నా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై ఈడీ అక్రమంగా కేసు నమోదు చేసి జైల్లో ఉంచడం అన్యాయమని రాజ్యసభ వద్దిరాజు రవిచంద్ర మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో కవితకు బెయిల్ మంజూరు చేసి ఊరట కల్పించడం సంతోషకరమన్నారు. ప్రజాప్రతినిధిగా ఉన్న కవితను సామాన్య ఖైదీల మాదిరిగా చూడటంపై న్యాయస్థానం కూడా తప్పుబట్టిందని వెల్లడించారు.

'కవితపై చేసిన ఆరోపణలను నిరూపించాలి'

వరంగల్ సిటీ: బీజేపీ, కాంగ్రెస్ నాయకులకు దమ్ముంటే కవితపై చేసిన ఆరోపణ ను నిరూపించాలని బీఆర్ఎస్ రైతు సమన్వయ సమితి మాజీ జిల్లా మాజీ కోఆర్డినేటర్ ఎల్లావుల లలితా యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం కవితకు బెయిల్ మంజూరు కావడంతో ఏనుమాముల మార్కెట్ వద్ద సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన లలితా యాదవ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీని, మాజీ సీఎం కేసీఆర్‌ను ఎదుర్కోలేక బీజేపీ, కాంగ్రెస్ చీకటి ఒప్పందంలో భాగంగా కవితను లిక్కర్ కుంభకోణంలో ఇరికించారని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎల్లావుల కుమార్, రాజశేఖర్, కొత్తపల్లియాదగిరి, బొల్లె సాంబయ్య, భూక్యా శంకర్, ఎండి. అఫ్జల్, ఎండి. సలీం పాల్గొన్నారు.

వాహనదారులకు జరిమానా

మట్టెవాడ, ఆగస్టు 27: మద్యం తాగి వాహనం నడిపిన కేసుల్లో 33 మంది వాహనదారులకు మంగళవారం వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపి ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డ 33 మంది వాహనదారులకు రూ. 36,400 జరిమానా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన 13 మంది వాహనదారులకు రూ.18,600 జరిమానా విధించినట్లు తెలిపారు.

గవర్నర్ రాక కోసం ఏర్పాట్లు

• కోటను పరిశీలించిన కలెక్టర్ • భద్రకాళి ఆలయంలో సెంట్రల్‌జోన్ డీసీపీ బందోబస్తు చర్యలు

ఖిలావరంగల్, ఆగస్టు 27: నగరంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పర్యటనకు సంబంధించి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సత్యశారద అధికారులకు ఆదేశించారు. బుధవారం ఖిలావరంగల్ మధ్యకోటలోని శిల్పసంపదలు, శిల్పాల ఆవరణను గవర్నర్ తిలకించనున్న సందర్భంగా కలెక్టర్ మంగళవారం ఏర్పాట్లను పర్యవేక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఖిలావరంగల్ ప్రాంత పరిసరాలు శానిటేషన్, పరిశుభ్రంగా ఉంచాలని, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహిణకు వేదిక ఏర్పాటు చేయాలని అధికారులకు సూ చించారు. కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా, ఆర్డీవో కృష్ణవేణి, కేంద్ర పురావస్తుశాఖ జిల్లా అధికారి మల్లేశం, అధికారులు పాల్గొన్నారు.

భద్రకాళి ఆలయంలో డీసీపీ పర్యవేక్షణ

వరంగల్ కల్చరల్: గవర్నర్ బుధవారం వరంగల్ భద్రకాళి అమ్మవారి దర్శనార్థం ఆలయానికి రానున్న నేపథ్యంలో ముందస్తుగా వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు. మంగళవారం ఆలయ ఈవో శేషు భారతి, ప్రధానార్చకులు భద్రకాళి శేషుతో చర్చించారు. పరిసరాలను డీసీపీ పరిశీలించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కూచన హరినాథ్ పాల్గొన్నారు.


భద్రకాళి ఆలయంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న డీసీపీ సలీమా


ఖిలావరంగల్‌కోటలో పర్యటిస్తున్న కలెక్టర్ సత్యశారద

స్ట్రాంగ్ రూంను పరిశీలించిన కలెక్టర్



వరంగల్‌సిటీ, ఆగస్టు 27: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూంలను మంగళవారం కలెక్టర్ సత్యశారద ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న అధి కారులతో మాట్లాడి సూచనలు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయండి

నగరంలో పర్యటించిన సీడీఎంఏ గౌతమ్


ఉనికిచెర్లలో వెంచర్‌ను సందర్శిస్తున్న గౌతం, అధికారులు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 27: కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, వెంచర్లను హైదరాబాద్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ (సీడీఎంఏ) వి.పి.గౌతంతోపాటు కుడా ఛైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సందర్శించారు. ఉనికిచె ర్ల వద్ద ఏర్పాటు చేసిన యునీ సిటీ వెంచర్, మడిపెల్లి వద్ద ఏర్పాటు చేసిన మా సిటీ వెంచర్, వరంగల్ ఓ సిటీ వెంచర్‌తోపాటు ఇన్నర్, ఔటర్ రింగు రోడ్లు, బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రం, నయీంనగర్‌లోని హైలెవల్ బ్రిడ్జి లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇక్కడ జరుగుతున్న పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. అనంతరం కుడా కార్యాలయానికి వెళ్లి అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సీడీఎంను కుడా ఛైర్మన్ సన్మానించారు. కార్యక్రమంలో సీపీవో అజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

కుడాలో సమీక్షా సమావేశం

'కుడా'కార్యాలయంలో మంగళవారం హైదరాబాద్ సీడీఎం అధికారి గౌతం ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. గౌతం మాట్లాడారు. సెప్టెంబరు 9లోపు కాళోజీ కళాక్షేత్రం పనులు పూర్తి చేయాలన్నారు. నయీంనగర్ వద్ద జరుగుతున్న బ్రిడ్జి పనులు యుద్ధ ప్రాతిప దికన పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద, షేక్ రిజ్వాన్ బాషా, కుడా వైస్ ఛైర్మన్ అశ్విని తానాజీ వాకడే, కుడా సీపీవో అజిత్‌రెడ్డి, హెచ్‌వో రమేష్, బల్దియా డీసీ రవీందర్, కుడా ఈఈ భీంరావు, ఏఈలు శ్రీకాంత్, సతీష్‌లు పాల్గొన్నారు.

ఘనంగా ఉట్ల పండుగ


రంగశాయిపేటలో ఉట్టికొడుతున్న యువకులు

శంభునిపేట, ఆగస్టు 27 : శ్రీకృష్ణ జన్మోత్సవాలలో భాగంగా రంగశాయిపేటలో ఉట్ల పండుగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. రంగశాయిపేట కురుమ కులస్థులు, ఉట్ల నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో మహంకాళీ మైదానంలో యువకులు ఉట్టి కొట్టారు. ఉట్ల ఉత్సవం నిర్వహణ కమిటీ బాధ్యులు జినుక రమేష్ ఇంటి నుంచి కురుమ కుల కళాకారుల డప్పు చప్పుల్లతో కృష్ణుడి చిత్రపటాన్ని తీసుకువచ్చి పూజలు చేశారు. మిల్స్ కాలనీ సీఐ మల్లయ్య కార్పొరేటర్ గుండు చందనపూర్ణచందర్, కేడల పద్మ జనార్దన్‌లు డ్రా తీసి పోటీలను ప్రారంభించారు. పోటీల్లో మణికంఠ యూత్, నెహ్రూ యూత్, మురళీకృష్ణ యూత్, మురారీ యూత్, గణేష్ యూత్, బృందావనం యూత్, భగత్ యూత్‌లు పాల్గొన్నాయి. మురారీ యూత్ ప్రథమ, మురళీ కృష్ణ జట్టు ద్వితీయ, నెహ్రూ యూత్ తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలుగా నిలిచిన వారికి బహుమతులతోపాటు నగదు పారితోషకం అందించారు. వేడుకల్లో కార్పొరేటర్ గుండు చందనపూర్ణ చందర్, పీఏసీఎస్ ఛైర్మన్ కేడల పద్మజనార్దన్, కొంతం తారామోహన్, ఉత్సవ సమితి బాధ్యులు మండల సీతారాములు, జినుక రమేష్, కంచె మల్లయ్య, చిగిరి పూర్ణచందర్, జినుక కుమార్, శేర్ల అనిల్ కుమార్, కోలా రాము, కర్ణాకర్ పాల్గొన్నారు.

'అసాంఘిక చర్యలకు పాల్పడవద్దు'

శంభునిపేట, ఆగస్టు 27: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మామునూరు ఏసీపీ తిరుపతి హెచ్చరించారు. బొల్లికుంట క్రాస్ రోడ్ వద్ద మంగళవారం మామునూరు పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. హాస్టల్‌లు, ఇళ్లల్లో తనిఖీలు చేశారు. వాహనాలతోపాటు అందరి గుర్తింపు కార్డులు పరిశీలించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా చట్ట ప్రకారం నడుచుకుంటామని ఈ సందర్భంగా విద్యార్థులు, స్థానికులతో ఏసీపీ ప్రమాణం చేపించారు. ఏసీపీ మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని, గంజాయి, గుట్కా లాంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ మేరకు ఇంటింటి తనిఖీలు చేపట్టి సరైన ధ్రువపత్రాలు లేని 95 ద్విచక్రవాహనాలు, 95అంబర్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో మామునూరు సీఐ రవి కుమార్, ఎస్ఐలు శ్రీకాంత్, కృష్ణవేణి మామునూరు డివిజన్ పరిధిలోని అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నగల బ్యాగు అప్పగింత

వరంగల్ చౌరస్తా, ఆగస్టు 27: ఆటోలో నగలు, డబ్బు ఉన్న బ్యాగ్‌ను బాధిత మహిళ మంగళవారం పోలీసులు అప్పగించారు. ఎస్సై వెంకన్న కథనం ప్రకారం. కాశిబుగ్గకు చెందిన వంటేల మాధవి ప్రైవేటు జూనియర్ కళాశాల హాస్టల్‌లో వంట మనిషిగా పనిచేస్తోంది. సోమవారం మాధవి హాస్టల్‌కు వెళ్తున్న క్రమంలో తన బ్యాగ్‌ను ఆటోలో మరిచిపోయింది. తర్వాత ఆటో డ్రైవర్ కిరణ్ నిజాయితీతో ఆ బ్యాగ్‌ను అదేరోజు పోలీసులకు అప్పగించాడు. మంగళవారం ఈ విషయం వివిధ పత్రికల్లో వార్తలు ప్రచురితం కావడంతో మంగళవారం పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. దాంతో ఎస్ఐ బ్యాంగ్‌ను ఆమెకు అప్పగించారు.

నేరాలను అరికట్టాలి

మట్టెవాడ, ఆగస్టు 27: నేరాలను ప్రాథమిక దశలో నివారించాలని, విద్యార్థులు నేరాలపై అప్రమత్తంగా ఉండాలని షీటీమ్ ఇన్‌స్పెక్టర్ సుజాత సూచించారు. మంగళవారం వరంగల్ షీ టీమ్ ఆధ్వర్యంలో ఎస్‌వీఎన్ రోడ్‌లోని కీస్ హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఆమె మాట్లాడుతూ ఎవరైనా మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తే షీ టీమ్‌కు సమాచారమివ్వాలని సూచించారు. సైబర్ నేరాలకు టోల్‌ఫ్రీ నెంబర్ 1930, మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తే 8712 685142, 87126 85270 నంబర్లకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం సైబర్ నేరాలపై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.విద్యాసాగర్, ఉపాధ్యాయులు వసంతలక్ష్మీ, అనిత్, స్వాతి, భవ్యన, షీటీమ్ హెడ్‌కానిస్టేబుల్, సూర్యనారాయణ, మహేందర్ పాల్గొన్నారు.

శ్రీనివాసరావుకు ఘన సన్మానం

ఖిలావరంగల్, ఆగస్టు 27: ఇటీవల సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికైన తక్కళ్ళపల్లి శ్రీనివాసరావును సీపీఐ జిల్లా సమితి నాయకులు సన్మానించారు. మంగళవారంశివనగర్‌లోని తమ్మెరభవన్‌లో బాణాసంచా కాల్చిసంబరాలు జరుపుకున్నారు. జిల్లా కార్యదర్శి మేకల రవి మాట్లాడుతూ శ్రీనివాసరావు ఇటీవల జరిగిన సీపీఐ రాష్ట్ర స్థాయి సదస్సులో రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికై మొదటిసారిగా వరంగల్‌కు వచ్చిన శ్రీనివాసరావును పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించామన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి పనాన ప్రసాద్, కార్యవర్గ సభ్యులు బుస్స రవిందర్,గన్నా రఘు రమేష్, గుండే బద్రీ, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదళ్ళ శరత్, జిల్లా కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

'సేవాతత్పరుడు బాలకృష్ణ'

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 27: సినీ హీరో, హిందుపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సేవాతత్పరుడు అని బాలకృష్ణ అభిమాన సంఘాల తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ జీఎల్ శ్రీధర్ అన్నారు. బాలకృష్ణ సినీరంగ ప్రవేశం చేసి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం మట్టెవాడలోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్లో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం మొక్కను నాటా రు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ దండాపంతుల రామ్మూర్తి, రాష్ట్ర టీసీ సెల ఉపాధ్యక్షుడు నాగవెల్లి సురేష్, శిరబోయిన రాజు, ఎండి. మస్తాన్, విజేందర్, ఎం.రాము, సుదర్శన్ పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉత్సవ సమితి

గణపతి ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి

వరంగల్ కల్చరల్, ఆగస్టు27: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో ఉత్సవ సమితి సభ్యులకు పోలీసులు, అధికారులు సహకరించి తగు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సత్యశారదకు వరంగల్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు వినతిపత్రం అందజేశారు. మంగళవారం సమితి అధ్యక్షుడు న్యాలకొండ భాస్కర్‌రావు ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్, మండపాల ఏర్పాటుకు ఆంక్షలు లేకుండా సహకరించాలని కోరారు. వరంగల్ మహానగరంలో బహిరంగ ప్రదేశాల్లో రోడ్లకు పక్కన హిందువులు అత్యంత పరమ పవిత్రంగా పూజించే గోమాతలను వధించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గణేష్ నిమజ్జనానికి అనువుగా చెరువుల్లో గుర్రపు డెక్కను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో గణేష్ ఉత్సవ సమితి కో కన్వీనర్ శ్రీరాం ఉదయ్‌కుమార్, వెలగందుల రాజు, గూడూరు రాకేష్, పెండ్లి సునంద్, అనుమాండ్ల శివకృష్ణ, బైరి శ్యామ్, గన్ను రామానుజన్, సతీష్, పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను తొలగించాలి


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 27: జిల్లాలో అక్రమ కట్టడాలు, నిర్మాణాలపై ఉక్కుపాదం మోపాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చంద్రగిరి సునీల్‌కుమార్ మాట్లాడుతూ వరంగల్ ఉమ్మడి జిల్లాలో కూడా హైడ్రా రావాలని, అవినీతి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి కలెక్టర్లకు వినతి పత్రాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ ఉపాధ్యక్షుడు అశోక్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాల పెంచాలి: డీఈవో

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు27: యాజమాన్య పాఠశాలల విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలు, అభ్యాసన ఫలితాలు పెంపొందించడానికి ఎంఈవోలు, హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో మామిడి జ్ఞానేశ్వర్ మంగళవారం ప్రకటనలో సూచించారు. విద్యార్థుల్లో చదవడం, రాయడం, లెక్కలు చేయడం లాంటి కనీస విద్యా సామర్థ్యాల పటిష్టానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని పేర్కొన్నారు. ఎఫ్‌ఎల్‌ఎన్, లిప్ కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. స్వల్ప మార్పులు, చేర్పులతో వాటిని ఈ విద్యా సంవత్సరం సైతం కొనసాగించేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు జిల్లాలో ప్రణాళికలు రూపొందిస్తామని, ఆ మేరకు జిల్లాలోని విద్యాశాఖలో వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న అధికారులు, ఎఫ్‌ఎల్‌ఎన్ నోడల్ అధికారులు, స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు పర్యవేక్షించాలని సూచించారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

వరంగల్ కల్చరల్, ఆగస్టు 27: శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం సందర్భంగా రెండో రోజు మంగళవారం నగరంలోని వైష్ణవ ఆలయాల్లో వైభవంగా జరిగాయి. గీతాభవన్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో, బట్టల బజార్‌లోని బాలానగర్ వేంకటేశ్వరస్వామి ఆలయం, ఇస్కాన్‌లోని శ్రీకృష్ణ మందిరంలో ప్రత్యేక అలంకరణలు, నైవేద్య నివేదనలు జరిగాయి. గీతా భవన్‌లో సామూహికంగా శ్రీవిష్ణు సహస్ర పారాయణం, దత్తక్షేత్రంలో అనఘాష్టమి వ్రతాలు జరిగాయి.

రెండో రోజూ ప్రతిష్ఠలు


విగ్రహాల వద్ద పూజలు చేస్తున్న మహిళలు

ఖిలావరంగల్, ఆగస్టు 27: శ్రీ శివశక్తి వినాయక మందిరంలో విగ్రహాల ఏర్పాటు రెండోరోజు కొనసాగుతుంది. మంగళవారం ఖిలాఖమ్మంరోడ్ వద్ద గల దేవాలయంలో అర్చకులు గణపతి, శివలింగం నందీశ్వరసహిత పార్వతీ దేవి విగ్రహాలను ఏర్పాటు చేశారు. వాటికి మహిళలు పంచామృతాలతో శుద్ధి చేశారు. అనంతరం విగ్రహాలను ఖమ్మం రోడ్, రుద్రమాంబనగర్, విద్యానగర్, ఏకశిలానగర్, ముదిరాజ్‌వీధి తదితర ప్రాంతాలలో రథాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు, కార్పొరేటర్ బైరబోయిన ఉమా-దామోదర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి చెన్నూరి దేవేందర్, కోశాధికారులు మంతిని చక్రధర్, గండి నాగరాజు, గంద్రాతి నవీన్, సిద్ధం రాము, అచ్చవినోద్, నల్లకుంట రవికుమార్, అపరాదపు సారంగపాణి, వాసం సదానందం, నాగవెల్లి రాజన్‌బాబు, జగం సంపంత్, అనంతుల రమేష్, గజ్జెల శ్యామ్, వడ్డెపల్లి భరత్, పొన్నంకు మారస్వామి, రమేష్ పాల్గొన్నారు.

నాగవల్లి పత్రాలతో నాగేంద్రుడికి పూజలు



గీసుగొండ, ఆగస్టు 27: మండలంలోని ఊకల్‌లోని నాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో నాగేంద్రుడిని శ్రావణ మాస చివరి మంగళవారం రోజు నాగవల్లి పత్రాలతో అలం కరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహ ర్షాచార్యులు, ఆలయ కమిటీ ఛైర్మన్ బాబురావు, శ్రీరాములు రమేష్, పాల్గొన్నారు.

ఓ సిటీలో ప్రారంభమైన క్రీడోత్సవాలు

శంభునిపేట, ఆగస్టు 27 : వరంగల్ జిల్లా క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో వరంగల్ ఓసిటీ క్రీడా మైదానంలో జిల్లా స్థాయి క్రీడోత్సవాలు సందడిగా ప్రారంభమయ్యాయి. పోటీలను జిల్లా యువజన క్రీడల అధికారి సత్యవాణి ప్రారంభించారు. కబడ్డీ, జూడో, రెజ్లింగ్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు పాఠశాలల నుంచి మొత్తం 42జట్లు పాల్గొన్నాయి. కబడ్డీలో 12, జూడోలో 12, రెజ్లింగ్‌లో 12, క్రికెట్‌లో 6 జట్లు పోటీ పడ్డాయి. బుధవారం జరిగే తుది పోటీల్లో గెలుపొందిన జట్లకు ఈనెల 29న ఓ సిటీలో జరిగే క్రీడా దినోత్సవంలో బహుమతుల ప్రదానో త్సవం ఉంటుందని జిల్లా డిప్యూటీ స్పోర్ట్స్ ఆఫీసర్ ఇందిరా తెలిపారు. పోటీల పర్యవేక్షకులుగా డీవైఎస్ఓ కోచ్‌లు లింగ మూర్తి, కుమారస్వామి, మహేష్‌లు వ్యవహరిస్తున్నారు. కార్యక్రమంలో రవి, డీవైఎస్‌వో అధికారులు రమేష్, మౌనిక, రాజేందర్, అహ్మద్, పాషా, పీఈటీలు పాల్గొన్నారు.


జూడోలో పాల్గొన్న క్రీడాకారులు

రేపు క్రీడా ర్యాలీ..

క్రీడా దినోత్సవం సందర్భంగా ఈనెల 29న వెంకట్రామ జంక్షన్ నుండి ఓ సిటీ మైదానం వరకు క్రీడా ర్యాలీ ని నిర్వహిస్తున్నట్లు డీవైఎస్ఓ తెలిపారు. ఉదయం 9.30గంటలకు ర్యాలీ ప్రారంభం అవుతుందన్నారు. క్రీడా కారులు, ఔత్సాహికులు క్రీడా ర్యాలీలో పాల్గొనాలని తెలిపారు. కాగా, జాతీయ క్రీడా దినోత్సవ పోస్టర్‌ను కలెక్టర్ సత్య శారద, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణిలు కలెక్ట రేట్‌లో అధికారులతో కలిసి ఆవిష్కరించారు.

విషజ్వరంతో ఇంటర్ విద్యార్థి మృతి



అర్జున్(ఫైల్)

నర్సంపేట టౌన్, ఆగస్టు 27 : విషజ్వరంతో ఇంటర్ విద్యార్థి మృతిచెందిన ఘటన నర్సంపేట పట్టణంలో మంగళవారం చోటుచేసుకుంది. మృతుడి కుటుంబసభ్యుల కథనం ప్రకారం. నర్సంపేటలోని మహబూబాబాద్‌రోడ్‌లో నివాసం ఉంటున్న సంకినేని కృష్ణ-రజిత దంపతులకు ముగ్గురు కుమారులు. కృష్ణ పెయిటింగ్ వృత్తి చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. చిన్న కుమారుడు అర్జున్(17) పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యనభ్యసిస్తున్నాడు. మూడు రోజుల క్రితం జ్వరం రావడంతో పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్సలందించారు. జ్వరం తీవ్రమవడంతో సోమవారం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారంఉదయం మృతి చెందాడు. జ్వరం బ్రెయిన్‌కు చేరడంతోనే మృతి చెందినట్లు వైద్యులు తెలిపినట్లు రోదిస్తూ మృతుడి తల్లిదండ్రులు తెలిపారు. అర్జున్ అకాల మృతికి ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్‌దీప్, ఛాయసంస్థ ప్రతినిధి డేవిడ్ సంతాపం వ్యక్తం చేశారు.

నాగవల్లి పత్రాలతో నాగేంద్రుడికి పూజలు



నాగవల్లిపత్రాల అలంకరణలో నాగేంద్రుడు

గీసుగొండ, ఆగస్టు 27 : మండలంలోని ఊకల్‌లోని నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నాగేంద్రుడిని శ్రావణమాస చివరి మంగళవారం రోజు నాగవల్లి పత్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అర్చనలు, అభిషేకాలు చేయించారు. విద్యుత్‌శాఖ డీఈ మల్లికార్జున్, మాధవి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్షాచార్యులు, ఆలయ కమిటీ ఛైర్మన్ బాబురావు, శ్రీరాములు రమేష్, పాల్గొన్నారు.

మాల కులస్థులకు తగిన న్యాయం చేస్తా



సీఎం రేవంత్ రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న మాల సామాజిక వర్గం నేతలు

వర్ధన్నపేట, ఆగస్టు 27 : ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పురస్కరించుకొని మాల కులస్తులకు తగిన న్యాయం చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజుతో పాటు మాల సామాజిక వర్గం ప్రజా ప్రతినిధులు, మాల మహానాడు నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం సమర్పించారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై ఒక కమిటీని నియమించి ఆ రిపోర్టు ఆధారంగా అందరికి న్యాయం జరిగేలా చూస్తానని హామీఇచ్చారు. సీఎంను కలిసిన వారిలో ఎమ్మెల్యేలు వివేక్ వెంకటస్వామి, కేఆర్.నాగరాజు, మట్టా రాగమయి, చిక్కుడు వంశీకృష్ణ, మేడిపల్లి సత్యం, గణేష్, ఎంపీ గడ్డం వంశీ, మాల మహానాడు నేతలు చెన్నయ్య ఉన్నారు.

ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలి

చెన్నారావుపేట, ఆగస్టు 26 : గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల కోసం వార్డుల వారీగా ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని జడ్పీ సీఈవో రాంరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబంలో ఉన్న వారి అందరి పేర్లను, కొత్తగా పెళ్లయిన వారి పేర్లను వారి కుటుంబంలో ఒకే వార్డులో వచ్చే విధంగా జాబితాను తయారు చేయాలన్నారు. రెండు రోజుల్లో అన్నీ గ్రామాలల్లోని జాబితాను తయారు చేయాలని అన్నారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలన్నారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్య పనులను చేపట్టాలని కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీవాణి, ఎంపీవో శ్రీధర్‌రాజు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నర్సంపేట మునిసిపాలిటీలో గాడి తప్పిన పాలన

కమిషనర్ లేక కుంటుపడుతున్న అభివృద్ధి

చేతులెత్తేసిన పాలకవర్గం

నర్సంపేట టౌన్, ఆగస్టు 27 : నర్సంపేట మునిసిపాలిటీలో పాలన గాడి తప్పింది. మునిసిపాలిటీకి ప్రధాన అధికారి కమిషనర్ లేక అభివృద్ధి కుంటుపడుతున్నది.కమిషనర్ లేకపోయినా కనీసం మేనేజర్ సైతం లేకపోవడం, పాలకవర్గంలో కౌన్సిలర్ల కుమ్ములాటలతో చేతులేత్తయడంతో పట్టణంలో సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారడంతోపాటు కోట్లాది రూపాయల పనులు నిలిచిపోయాయి. అటు అభివృద్ధి జరగక, ఇటు సమస్యలు పరిష్కారం కాక పట్టణ ప్రజలు ఆందోళన చెందుతూ, అసలు నర్సంపేట పట్టణానికి ఏమైందంటూ చర్చించుకోవడం కనిపిస్తుంది. నర్సంపేట పట్టణంలో 24 మంది కౌన్సిలర్లు ఉండగా అందులో బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు 18మంది, ఆరుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు ఉన్నారు. పాలకవర్గంగా ఉన్న బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కొన్ని నెలల క్రితం చైర్మన్‌పై అవిశ్వాసానికి దిగడం, అది కాస్తా వారి అధినాయకునితో చర్చలతో చతికిలపడడం విదితమే. ఆ తర్వాత ఎనిమిది నెలల నుంచి బీఆర్‌ఎస్ కౌన్సిలర్లలో కొంత మంది పార్టీనీ వీడడం, మరికొందరు అదే పార్టీలో ఉంటూ చైర్మన్‌పై విమర్శలకు దిగుతూ తమ వార్డుల పరిధిలో అభివృద్ధి చేయలేదంటూ పత్రికలకెక్కడం, సమాచార హక్కు చట్టం ద్వారా నిధులు, పనుల వివరాలు తెలపాలంటూ హుకుమ్ జారీ చేయడంతో నాలుగేళ్లలో ప్రజాభివృద్ధి కాంక్ష ఏమైందంటూ ప్రజలు అవాక్కవుతున్నారు. దీంతో చైర్మన్ సైతం చేతులేత్తేసే పరిస్థితి కనిపిస్తున్నది. అభివృద్ధిని చేయించాల్సిన అధికారి లేక, ఇటు ప్రజా సమస్యలను పట్టించుకోవాల్సిన పాలకవర్గం పట్టింపు లేనితనం పట్టణంలో గత కొంత కాలంగా పాలన గాడితప్పి గందరగోళంగా మారింది.



మునిసిపాలిటీ రెన్నోవేషన్ పేరుతో సగం పనులు చేసి తాళం వేసిన పార్కు

కమిషనర్ లేక కుంటుపడుతున్న అభివృద్ధి

కమిషనర్‌గా విధులు నిర్వహించిన శ్రీనివాస్ నెల రోజుల క్రితం బదిలీపై వెళ్లగా, నాటి నుంచి కమిషనర్ నియామకం చేపట్టలేదు. మూడు రోజుల క్రితం వర్ధన్నపేట కమిషనర్ జోన కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. కమిషనర్ తర్వాత స్థానమైన మేనేజర్ పోస్టు గత ఏడాదిగా ఖాళీగాఉంటున్నది. దీంతో ఆర్థిక సంఘం నిధులు రూ.4కోట్లతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, టఫ్‌డికో నిధులు రూ.20 కోట్ల పనులు డిజిటల్ టెండర్ కమిషనర్ లేక పనులు ఆగిపోయాయని మునిసిపల్ ఉద్యోగులు చెబుతున్నారు. పన్నుల వసూళ్లు, ఇంటి నంబర్ల కేటాయింపులు, ఉద్యోగుల నియామకాలు, ఇతర అనుమతుల విషయాల్లో ఉన్నతాధికారి లేకపోవడంతో ఎవరి ఇష్టారాజ్యంగా వారు పనులు చేస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఒకరి స్థానంలో మరొకరు ఉద్యోగం చేయడం, కొందరైతే ఏకంగా సంతకం పెట్టి విధులు చేయకుండానే వెళ్లిపోతున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. అలాగే కార్యాలయం ఆవరణలో పార్క్‌లో రూ.5లక్షలతో గ్రాస్ వర్క్, బోర్, పైపులైన్, ఎర్రమట్టి పనుల వరకు నిలిచిపోయాయి. దీంతో పార్క్‌కు తాళం వేయడంతో ఓపెన్ జిమ్, చిల్డ్రన్ పార్క్ కోసం వచ్చే వారికి నిరాశ ఎదురవుతున్నది.

మునిసిపాలిటీలో పాముల సంచారం

పట్టించుకునేవారు, పర్యవేక్షించే వారు లేక పట్టణానికి ఆదర్శంగా ఉండాల్సిన మునిసిపాలిటీ కార్యాలయ ఆవరణ బురద రోడ్లు, పిచ్చిమొక్కలతో కనిపిస్తున్నది. పిచ్చిచెట్లు, చెత్తాచెదరం పెరగడంతో పాములు పగటిపూటనే సంచరిస్తుండడంతో సిబ్బంది, ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

దుమ్ము రేపుతున్న రోడ్లు

పట్టణంలోని అంతర్గత రోడ్ల మాట దేవుడెరుగు. ప్రధాన రోడ్లు వరంగల్ క్రాస్ రోడ్డు నుంచి పాకాల్ రోడ్, మల్లంపల్లి రోడ్, నెక్కొండ రోడ్, వరంగల్ రోడ్, మాధన్నపేట రోడ్లన్నీ గుంతలమయమయ్యాయి. రోడ్లపై వాహనాలు వెళ్లే సమయంలో దుమ్మురేపుతుండడంతో బాటసారులు, వాహన చోదకులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వీధుల్లో కుక్కల స్వైరవిహారంతో ప్రజలు కుక్కకాటు బారినపడి ఆస్పత్రులపాలవుతున్నారు.



మునిసిపాలిటీలో అడుగుపెట్టగానే పాలకుల చిత్తశుద్ధికి అద్దం పట్టే బురదరోడ్డు

రాత్రివేళల్లో రహదారులన్నీ పశువులకు అడ్డాగా మారడంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.

దోమల నివారణకు చర్యలు శూన్యం

నర్సంపేట పట్టణంలోని వీధుల్లో, గృహవాసాల వద్ద దోమల నివారణకు చేపట్టాల్సిన ఫాగింగ్ చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు దోమకాటుతో జ్వరాల బారిన పడి మృత్యువాత పడుతున్నారు. మురుగు గుంతల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించేకార్యక్రమాలను తూతూ మంత్రం చేస్తుండడంతో ప్రజలు జ్వరాలతో మంచానపడుతున్నారు. మంగళవారం సంకినేని అర్జున్ అనే ఇంటర్ విద్యార్థి విషజ్వరంతో మృతిచెందాడు. అనేక మంది దోమకాటుతో మంచానపడ్డారు. ఇప్పటికైనా కమిషనర్‌ను నియమించి ప్రజాభివృద్ధి, సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పత్తి పంటల పరిశీలన



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏవో, ఎస్సై

పర్వతగిరి, ఆగస్టు 27 : మండలంలోని పెద్దతండాలో నకిలీ పురుగు మందులు పిచికారీ చేయడంతో పంటలు మాడిపోయిన విషయంపై మంగళవారం అధికారులు పత్తి పంటలను పరిశీలించారు. నకిలీ మందులు విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రైతులు ఏవో, ఎస్సైలకు ఫిర్యాదు చేయడంతో మండల వ్యవసాయ అధికారి ప్రశాంత్ కుమార్, ఎస్సై ప్రవీణ్‌లు పత్తి పంటలను పరిశీలించారు. నష్టపోయిన రైతులతో మాట్లాడి వివరాలు అడిగితెలుసుకుని విచారణ చేపట్టారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు వారు తెలిపారు.

హైడ్రాను వరంగల్‌లో కొనసాగించాలి

గీసుగొండ, ఆగస్టు 27: హైదరాబాద్‌లో ఆక్రమణలకు గురైన భూముల్లో నిర్మించిన భవనాలను కూల్చిన విధంగానే వరంగల్‌లో కూడా హైడ్రాను కొనసాగించి, ఆక్రమణలకు గురైన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని జాతీయ మానవహక్కుల కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు గంగుల అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ సత్యశారదను కలిసి వినతిపత్రం అందచేసినట్లు చెప్పారు. వరంగల్ మహానగరంతోపాటు గ్రామాల్లో ఉన్న చెరువు శిఖం భూములు, కుంటలు ఆక్రమణకు గురైనట్లు వినతిపత్రంలో పేర్కొన్నట్లు వివరించారు.

వైద్య సేవలు వినియోగించుకోవాలి



అశోక్‌నగర్‌లో మాట్లాడుతున్న డాక్టర్ ప్రకాశ్

ఖానాపురం, ఆగస్టు 27: ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందించే వైద్య సేవలను వినియోగించుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రకాశ్ అన్నారు. నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాల, ఖానాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సంయుక్తంగా మండలంలోని అశోక్‌నగర్‌లో ప్రత్యేక వైద్య నిపుణుల ద్వారా మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వ వైద్యకళాశాల ప్రొఫెసర్, హెచ్‌వోడీ డాక్టర్ పూనమ్‌కుమారి రూ మాట్లాడుతూ ప్రతిఒక్కరు పరిసరాల పరిశుభ్రతో పాటు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ శిబిరంలో 212మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ అరుణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు మురళి, బాలాజీ, పరశురామ్, గిరిధర్, రాజు నాయక్, రాకేష్, సతీష్, సునీత, శ్రీనివాసచారి, భాస్కర్, దామోదర్ రెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, భద్రు తదితరులు పాల్గొన్నారు.

• నెక్కొండ: వర్షాకాలంలో పల్లెల్లోని వీధుల్లో రోడ్ల వెంట ఇండ్ల అవరణల్లో నీటి నిలువలు పెరిగి దోమలు స్వైరవిహారం చేస్తున్న కారణంగా అంటువ్యాధులకు తోడు డెంగ్యూ వంటి ప్రమాదకరమైన వ్యాధులు ప్రబలి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని నెక్కొండ ఎంపీడీవో దయాకర్, అలంకానిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ అర్చన తెలిపారు. మంగళవారం అలంకానిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చిన్నకొర్పోలు శివారు పంతులుతండా, బొల్లికొండ గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ రెండు గ్రామాల్లో ఇటీ వల ఇద్దరు మహిళలకు డెంగ్యూ వ్యాధి నిర్ధారణ కావడంతో ఈ ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రోజు సాయంత్రం సమయంలో వీధుల్లోని చెత్తను, నీటి నిలువలను తొలగించడంతో పాటు దోమల నివారణకు ఎండిన వేపాకు పొగలువేయాలని సూచించారు. జర్వం లక్షణాలు కనిపించిన వెంటనే ప్రాథమిక ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు జరిపించి చికిత్సలు చేయించుకోవాలని సూచించారు. 198మందికి వైద్య పరీక్షలను నిర్వహించగా, జ్వరంతో ఇబ్బంది పడుతున్న 11 మంది నుంచి రక్త నమూనాలను ఆరోగ్య సిబ్బంది సేకరించారు. అనంతరం అధికారుల సమక్షంలో వైద్య సిబ్బంది ఇంటింటికి దోమల నివారణ మందులను స్ప్రే చేశారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ మలేరియా అధికారి నందు, సిబ్బంది రమాదేవి, పద్మ, సుజాత, ప్రవళిక, కార్యదర్శులు పెంటయ్య, సురేష్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

దుగ్గొండి, ఆగసు 27 : మండలంలోని వెంకటాపురంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు మంగళవా రం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బోళ్ల స్వప్న, ముత్యాల వైష్ణవి కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. పంపిణీ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు పోగాకు వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ రాజేశ్వర్‌రావు, మార్కెట్ డైరెక్టర్ హింగే రామారావు, ఏడాకుల రమణారెడ్డి, మాటేటి రవి, పోగాకు దేవేందర్, శ్రీను పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

పర్వతగిరి, ఆగస్టు 27: కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్ అన్నారు. మంగళవారం విద్యార్థులతో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎద్దు రాహుల్, మండల గర్ల్స్ కన్వీనర్ శ్రీజ, రమ్యశ్రీ, అద్విక, దీక్ష, ఉల్లెంగుల సిద్ధు, సంతోష్ కుమార్, సుమంత్, ప్రదీప్, అభి, చరణ్ పాల్గొన్నారు.

కవిత విడుదలపై హర్షం

నర్సంపేట, ఆగస్టు 27 : ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ తెలంగాణ ఉద్యమకారుడు, విద్యార్థి నాయకుడు తడిగొప్పుల మల్లేష్ ఆధ్వర్యంలో మంగళవారం నర్సంపేట పట్టణంలో స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తడిగొప్పుల ప్రవీణ్ కుమార్, విష్ణు, నాగరాజు, మణికంఠ, సుభాష్, రాజు పాల్గొన్నారు.

• వర్ధన్నపేట: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బెయిల్ రావడాన్ని పురస్కరించుకొని బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ జిల్లా ప్రతినిధి కంజర్ల మహేష్ ఆధ్వర్యంలో వర్ధన్నపేటలో సంబరాలు నిర్వహించారు. మహేష్ మాట్లాడుతూ ఎన్ని కుట్రలు పన్నినా చివరకు న్యాయమే గెలిచిందన్నారు.

చనిపోయిన వ్యక్తి పేరిట పంట రుణమా?

నల్లబెల్లి పీఏసీఎస్ నిర్వాహకం



బొంద్యాలు (ఫైల్)

నల్లబెల్లి, ఆగస్టు 27 : 2017 సంవత్సరంలో చనిపోయిన తన తండ్రి బత్తిని బొంద్యాలు, 2023 డిసెంబర్ 9న పంట రుణం తీసుకున్నట్లు ఎలా ఉంటుందని నల్లబెల్లి పీఏసీఎస్, డీసీసీబీ సిబ్బందిపై కుమారుడు బత్తిని ఓదేలు మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత రైతు బత్తిని ఓదేలు కథనం ప్రకారం... నల్లబెల్లి గ్రామానికి చెందిన బత్తిని ఓదేలు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీ రాలేదని వ్యవసాయ అధికారులను సంప్రదించాడు. వారు చెక్ చేసి రూ.94వేలు పంట రుణం మాఫీ కాలేదన్నారు. పైగా అతనితండ్రి బొంద్యాలుపై రూ.1లక్ష పంట రుణం ఉందన్నారు. దీంతో ఒక్కసారిగా అవాక్కయిన ఓదేలు తన తండ్రి 2017 సంవత్సరంలో చనిపోయాడన్నారు. ఆయనపై పంట రుణం ఎలా ఉంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఏసీఎస్‌లో అడగమని అధికారులు సలహా ఇవ్వగా, పీఏసీఎస్ బాధ్యులను నిలదీశారు. దీంతో పీఏసీఎస్ బాధ్యులు డీసీసీబీ బ్యాంకుకు తీసుకెళ్లి చెక్ చేసి ఓదేలు తండ్రి బొంద్యాలుపై లోను ఉందని తెలిపారు. 2017 సంవత్సరంలో చనిపోయిన తన తండ్రి 2023 డిసెంబర్ 9న పంట రుణం లోను తీసుకున్నట్లు ఆన్‌లైన్‌లో ఎలా ఉందని తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశాడు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో న్యాయం చేయాలని పీఏసీఎస్ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఓదేలు ఫిర్యాదు చేశాడు. విచారణ చేసి బాధ్యులపై చర్యలు సుకుంటారని ఎస్‌ఐ ప్రశాంత్ బాబు తెలిపారు.

ఉద్యాన పంటల సాగుతో అధిక లాభాలు

దుగ్గొండి, ఆగస్టు 27 : ఉద్యానవన పంటలు సాగు చేసి రాయితీలు పొంది అధిక లాభాలు గడించా లని డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి జ్యోతి సూచించారు. మండలంలోని మందపల్లి, చాపలబండ గ్రామాల్లో సాగు చేసిన అరటి పంటలను మంగళవారం ఉద్యానవన శాఖ అధికారి సందర్శించి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యానవన పంటలు వేసుకున్న రైతులు సకాలంలో ఎరువుల యజమాన్యం చేపట్టాలన్నారు. అరటి, బొప్పాయి పంటసాగు చేసిన రైతులకు 40శాతం రాయితీని ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఉద్యానవన పంటలకు 90శాతం రాయితీపై డ్రిప్పు సౌకర్యం ఉందన్నారు. సాగుచేసి కావలసిన రైతులు ఆధార్ కార్డు, పట్టాపాస్ పుస్తకం, బ్యాంక్ అక్కౌంట్‌లతో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు ఎడెల్లి అశోక్‌రెడ్డి, ఆరె రాజిరెడ్డి, తోకల శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, బాబురావు, సాంబరెడ్డి, దామోదర్‌రెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, విజయ పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో సేవలు ప్రారంభం

పర్వతగిరి, ఆగస్టు 27 : పర్వతగిరి మండలంలో ఆర్టీసీ కార్గో సేవలు మంగళవారం ప్రారంభమయ్యా యి. మండల కేంద్రంలోని స్కై ఇంటర్‌నెట్ సెంటర్‌లో సేవలను ఆర్టీసీ వరంగల్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పవన్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్ర దేశ్, కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు తక్కువ సమయంలో కొరియర్ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్గో సేవలను వ్యాపారస్తులు, రైతులు, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో వరంగల్ రీజియన్ సేల్స్ లీడర్ ఎస్.రామయ్య, కార్గో ఏజెంట్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

పర్వతగిరి, ఆగస్టు 27: నకిలీ పురుగు మందులు విక్రయించడంతో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటస్వామికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నకిలీ పురుగుల మందులు విక్రయిస్తున్నా, అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే యాకూబ్‌షావళి ఆగ్రో ఏజెన్సీ యాజమాన్యం 15 మంది రైతులకు విక్రయించిందని అన్నారు. రైతులకు ఎకరానికి రూ.5లక్షల నష్టపరిహారం చెల్లించాలని, దుకాణ యజమానిపై నామమాత్రపు కేసులు పెట్టి చేతులు దులుపుకోవాలని అధికారులు ప్రయత్నిస్తున్నట్లు సందేహాలు వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతంకాకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్పీ జిల్లా కార్యదర్శి వల్లందాసు కుమార్, టీడీపీ మండల నాయకుడు కట్ల భద్రయ్య, నాయకులు దొమ్మటి వీరస్వామి, కె.నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

కారు, ఆటో ఢీ : నలుగురికి గాయాలు

దుగ్గొండి, ఆగస్టు 27 : మండలంలోని గిర్నిబావి వైన్‌షాప్ దగ్గర ప్రధాన రహదారిపై మంగళవారం కారు, ఆటో ఎదురెదురుగా వచ్చి ఢీకొనగా ఇద్దరికి తీవ్రగాయాలు కాగా, ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. నర్సంపేట నుంచి వరంగల్‌కు కారు పోవుచుండగా వరంగల్ నుంచి నర్సంపేటకు ఆటో వస్తున్న క్రమంలో ఎదురెదురుగా గిర్నిబావి వైన్ షాపు దగ్గర కారు, ఆటో ఢీకొన్నాయి, దీంతో ఆటో ముందుకుపోతూ రోడ్డుపై పోవుతున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి బోల్తాపడింది. నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పనులు చేయడానికి ఆటోలో ప్రయాణిస్తున్న మనోజ్, సంజీవ్‌మాధవన్‌కు, ద్విచక్రవాహనంపై వెళ్తున్న మండలంలోని తిమ్మంపేట గ్రామానికి చెందిన ఎస్‌కే.గోరిమియా, పర్వీన్‌లకు గాయాలయ్యాయి. సంజీవ్‌మాధవన్ భుజానికి, పర్వీన్ తొంటి బాగంలో ఫ్రాక్చర్ కాగా, మనోజ్, గోరిమియాకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని ఢీకొన్న కారుకు సంబంధించిన వారు నర్సంపేట ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలన చేశారు.

మహిళా సాధికారతపై అవగాహన

సంగెం, ఆగస్టు 27 : మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం మహిళా సాధికారతపై అవగాహన సదస్సు నిర్వహించారు. జెండర్ స్పెషలిస్ట్ రమాదేవి మాట్లాడుతూ సమాజంలో ఆడ పిల్లలకు, మహిళలకు భద్రత లేదని, వారికి సమస్యలు వచ్చినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌వో నీలిమ పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి



ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న చాపర్తి కుమార్

గీసుగొండ, ఆగస్టు 27: కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని రజక పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ డిమాండ్ చేశారు. గీసుగొండలో ఆయన ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఆయన మాట్లాడుతూ బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు పెంచి స్థానిక ఎన్నికలు నిర్వహించాలని హైదరాబాద్‌లో ఆమరణ నిరాహార దీక్ష చేపడితే పోలీసులు బలవంతంగా తన గ్రామం గీసుగొండకు వచ్చి వదిలేసివెళ్లారన్నారు. అసైన్డ్ భూముల సమితి (ఏబీఎస్) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కలకోట మహేందర్‌తో కలిసి ఆమరణ దీక్ష చేస్తున్నట్లు చెప్పారు. డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, కందికొండ సాంబయ్య, ధనలక్ష్మి, కొమురమ్మ, ఎల్లమ్మ, అనిల్‌రెడ్డి, యాదమ్మలు దీక్షకు మద్దతు తెలిపారు.

ఓసిటీలో ప్రారంభమైన క్రీడోత్సవాలు



జూడోలో పాల్గొన్న క్రీడాకారులు

శంభునిపేట, ఆగస్టు 27 : వరంగల్ జిల్లా క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో వరంగల్ ఓసిటీ క్రీడా మైదానంలో జిల్లాస్థాయి క్రీడోత్సవాలు సందడిగా ప్రారంభమయ్యాయి. పోటీలను జిల్లా యువజన క్రీడల అధికారి సత్యవాణి ప్రారంభించారు. కబడ్డీ, జూడో, రెజ్లింగ్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు పాఠశాలల నుంచి మొత్తం 42జట్లు పాల్గొన్నాయి. కబడ్డీలో 12, జూడో లో 12, రెజ్లింగ్‌లో 12, క్రికెట్‌లో 6 జట్లు పోటీ పడ్డాయి. బుధవారం జరిగే తుది పోటీల్లో గెలుపొందిన జట్లకు ఈ నెల 29న ఓ సిటీలో జరిగే క్రీడాదినోత్సవంలో బహుమతు ల ప్రదానోత్సవం ఉంటుందని జిల్లా డిప్యూటీ స్పోర్ట్స్ ఆఫీ సర్ ఇందిరా తెలిపారు. పోటీల పర్యవేక్షకులుగా డీవైఎస్‌ఓ కోచ్‌లు లింగమూర్తి, కుమారస్వామి, మహేష్‌లు వ్యవహరి స్తున్నారు. కార్యక్రమంలో రవి, డీవైఎఫ్‌ఓ అధికారులు రమేష్, మౌనిక, రాజేందర్, అహ్మద్, పాషా, పీఈటీలు పాల్గొన్నారు.

రేపు క్రీడా ర్యాలీ..

క్రీడాదినోత్సవం సందర్భంగా ఈ నెల 29న వెంకట్రామ జంక్షన్ నుంచి ఓ సిటీ మైదానంవరకు క్రీడా ర్యాలీని నిర్వహిస్తున్నట్లు డీవైఎఫ్‌ఓ తెలిపారు.ఉదయం 9.30గంటలకు ర్యాలీ ప్రారంభం అవుతుందని, క్రీడాకారులు,ఔత్సాహికులు క్రీడా ర్యాలీలో పాల్గొనాలని తెలిపారు. కాగా, జాతీయ క్రీడాదినోత్సవ పోస్టర్‌ను కలెక్టర్ సత్య శారద, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణిలు కలెక్టరేట్‌లో అధికారులతో కలిసి ఆవిష్కరించారు.

యాప్ ద్వారా యువజన కాంగ్రెస్‌లో సభ్యుడిగా చేరండి

దుగ్గొండి, ఆగస్టు 27 : యాప్ ద్వారా యువజన కాంగ్రెస్‌లో సభ్యుడిగా చేరి పార్టీ బలోపేతంకై పని చేయాలని నర్సంపేట బ్లాక్ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ డ్యాగం శివాజీ, మండల యూత్ అధ్యక్ష అభ్యర్థి కొత్తకొండ రవివర్మలు పిలుపు నిచ్చారు. మండలంలోని గిర్నిబావిలో, మందపల్లి, పీజీ తండా, చాపలబండ గ్రామాల్లో మంగళవారం సమావేశాలు నిర్వహించి ఇండియన్ యూత్ కాంగ్రెస్ (ఐవైసీ) యాప్‌లో సభ్యుడిగా చేరడానికి సూచనలను చేశారు. దేశం అభివృద్ధి చెందడానికి యువత పాత్ర ప్రధానమైందన్నారు. ఎక్కువ సంఖ్యలో యాప్ ద్వారా సభ్యులుగా చేరి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలన్నారు. 18 నుంచి 35ఏళ్ల లోపు వారందరు సభ్యులుగా చేరడానికి అర్హులన్నారు. మండల యూత్ అధ్యక్షుడిగా రవివర్మను ఎక్కువ మేజార్టీతో గెలుపించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జయరాం నాయక్, ఎడెల్లి శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్వరచార్యులు, జంగిలి రవి, వెంకట్‌రెడ్డి, క్రాంతి, వివేక్, హరీష్, కృష్ణకాంత్, నేతాజీ తదితరులు పాల్గొన్నారు.